# THE HISTORY OF SALVATION (POETICAL) 1846

# రక్షణ చరిత్ర

**(1864లో లండన్ మిషన్ ప్రెస్ విశాఖపట్నం వారు ముద్రించినది)**

## యేసునాథ కథాసుధా ప్రవాహము

కం॥ శ్రీ వెలయు భవత్పదరా ।
జీవంబుల దలచి మ్రొక్కి సేవించెదనే।
గావింపబూను సత్కథ।
కీవే కరుణా సహాయ మేసు ప్రభువా

॥వ॥ అని ప్రియ దేవతా ప్రార్థనంబుజేసి తత్కరుణా సహాయంబున నా యొనరింపం బూనిన యేసునాథ కథాసుధా ప్రవాహం బనెడు ముముక్షుంజన రక్షణ చరిత్ర యందలి కథా క్రమంబెట్టిదనిన-

గీ॥ సృష్టి వివరంబు నాత్మకు క్షేమ మొసగు।
రక్షణోపాయమును నింక గ్రమముతోడ।
న్యాయపుందీర్పనగ వీడనాటి విధము।
మూడు ప్రకరణములు జేతు మోదమలర

॥వ॥ అందు ప్రథమ ప్రకరణంబను సృష్టి వివరం బెట్టిదనినా

## కీర్తన

రా-గౌళిపంతు తా-ఆది

అనాది దేవుండైన యెహోవా ఘనబలమిది గనరే । దినంబూలారిట దివి భువి మొదలగు ననూన జగమెల్లను సృజియించెను ॥అనాది॥

1. సకల చరాచర సాగరసంయుత జగంబు వాక్యమునన్ ప్రకటంబుగ నుద్భవింప నొనరిచె నకళంకుడతం డనంతు డాధ్యుడు ॥ఆనాది॥

2. ఆది నరులనెడి యాదాము హవ్వలను హస్తముతో తుదనూ। మేదినిపై జన్మింప జేసెనని మోదముతోడను మోషే వ్రాసెను ॥అనాది॥

3. ఆ యిరువురు నింపలరగ నేదేనను వన మధ్యమునన్ మాయా రహితాత్మకులై నగ్నులునై యుండిరి నిరతా నందంబున ॥ననాది॥

గీ॥ ప్రథమ మనుజులిట్లు పరిశుద్ధవంతులై ।
పాపమెరుగలేక పరమసాధు।
వృతిత్తో దనుండ వీక్షించి యొకనాడు
సర్పరూపమై పిశాచివచ్చె

॥వ॥ వచ్చి యచ్చెడుగు మాయా సర్పంబు నేర్పునం దన దుర్దర్పం బేర్పడ జేయ వలయునను దలంపు పెంపుసేయుచు నయ్యేకాంత వనాంతరంబునం దున ప్రియ కాంతునిం బాసి యెక్కింత దూరంబునం గ్రుమ్మరు నక్కాంతా రత్నంబు దెసం గనుంగొని యిట్లనియె.

## దరువు

రా–ఆనందబైరవి తా–త్రిపుట

ఏమి జేతువా ముద్దు గుమ్మా – వంటి నేల దిరిగెదు బల్కవమ్మా । ప్రేమతో దేవు డారామమందున – నీ స్వామిని యునిచి యే మేమి సౌఖ్యము లిచ్చె ॥నేమి॥

1. సందేహములు నేడు వీడుమీ – నీతో పొందు జేసెద నింక జూడుమీ ॥ సుందరాంగిరొ సర్వ శుభములు మన కింక పొందగలుగు నిన్నానందముతో గంటి ॥నేమి॥

2. చెలువైన యివ్వనమందునా – సర్వ ఫలములు భుజియింప పొందునా ॥ సెలవిచ్చె నా దేవుడలివేణి నిజముగా దెలుపవె నాకోర్కె లలరంగా వినియెద ॥నేమి॥

క॥ అని పలికెడు సైతానుని ।
ఘన వినయోక్తులకు నలరి కపట మొకింతై ।
నను దెలియరాని హవ్వ యి
ట్లనె దనమధురాధరమున నమృతము దొలుకన్ ॥

# ద్విపద

వినవె యో సర్పమా వివరంబుగాను ।
వినుపించెదను విన్న వృత్తాంతమెల్ల ॥
నాది దేవుడు నన్ను నాదాము నెంతొ
బ్రోదిగా తన యిచ్ఛ బుట్టించినాడు ॥
ఈ మంచి ఫలవనం బెల్లను మాకు ।
బ్రేమ నిచ్చెను దీని పేరు ఏదేను ॥
చెలువుండు నేను నీ చెట్లలో నున్న!
ఫలరసంబులు మెక్కి బ్రతుకుచున్నాము ॥
ఈ వనాంతరములో నేక వృక్షంబు ।
దేవుడు కల్పించి దృఢమైన యాజ్ఞ ॥
మా కిచ్చెనో సర్పమా యింక వినుము ।
ఏ కాలమున మీరలీ చెట్టు పండ్లు ॥
భక్షించరాదవి భక్షింతు రేని ।
శిక్షార్హులుగ చావు సిద్ధించు మీకు ॥

యిదియె నా యాజ్ఞ యంచెరిగించె దేవు ।
డది దలంచుచును మే మాచెట్టు వదలి ॥
కొదువ మ్రానులపండ్లు గోయుచు దినుచు ।
ముదమొందుదు మని యా ముద్దియ దెలుప ॥
విని దుష్ట కపట దర్వీకర మపుడు ।
తన మాయ పలుకుల తరుణితో ననియె ॥

## దరువు

రా- ఆనందభైరవి తా-త్రిపుట

ఎన్నటికిని చావరమ్మా నిశ్చయించి తెల్పెద నమ్ముకొమ్మా ।
కన్నులు మీకు బ్రసన్నమౌ నీ పండ్లు దిన్న దేవునివలె నున్నతులౌదురు ॥ఎన్నటికిని॥

1. మంచి సెబ్బర లాత్మఁగాంచనూ దేవుడెంచి మున్ని వె సృజియించెను
అంచయానరొ తన యట్లౌదురని మాని పించె దేవుఁడు మిమ్ము వంచనఁగా నిట్లు ॥ఎన్నటికిని॥

2. కంటికింపుఁగఁగనుపించదా ఇటువంటి ఫలముల స్వాదు మించదా
అంటవద్దని బల్కుటరసిచూడక యూర కుంటి రేటికి కోసి యెప్పుగాఁదినవచ్చు ॥నెన్నటికిని॥

ఉ॥ ఈకరణింబిశాచి పరమేశ్వరునానతిమిథ్య సేయు మా
యాకలి తోక్తులాత్మఁగొని యత్తరి బిత్తరి చిత్తముబ్బియా
మ్రాకు ఫలంబు లేరి తన మక్కువ తక్కువగాక మెక్కియ
కోక్కిలవాణి యాదాముని కుం దినఁగూరిమితోడ నిచ్చినన్

వ॥ అతం డతివ యిచ్చు ఫలంబులు భక్షింపం దొణంగే

తోటకము॥ సతిపతు లీగతి సమ్మతు లగుచున్
మృతి ఫలములు దామిటుల భుజింప
చతురాక్షులు తత్క్షణమున వీడెన్
మతులకు సిగ్గులు మాయను గూడెన్

# కీర్తన

రా॥ శంకరాభరణం తా-త్రిపుట

మన మొదటి తలిదండ్రు ల్మాయకులోనైరి యన్న లారా
వారి కనుగొనలకు సిగ్గు గదుర మోములు వంచి రన్నలారా ॥మన॥

1. తమ నగ్నతలు జూడ తామొప్ప లేరైరి యన్నలారా కొన్ని
యమరిన మఱ్ఱాకు - లంగంబులను గట్టి రన్నలారా ॥మన ॥

2. పరమాత్ముఁ డిడునాజ్ఞ పాలింపలేరైరి యన్నలారా
పూర్వ పరిశుద్ధి యెడబాసి పాపాత్ములైపోయి రన్నలారా ॥మన ॥

మరియను

## పంచచామరము

దినావసానమందనంత దేవుఁడవ్వనాంతరం
బునన్ విహారమాచరింపఁబోవ తద్ధ్వనిన్ వినన్
మనో విచార మొంది యాది మాత యాదాముండుత తో
టనున్న చెట్ల వెన్క కేగి డాగియుండి రిద్దరున్

॥వ॥ అప్పుడు కర్తయైన పరమేశ్వరుండు తన స్వరంబెత్తి పిలిచెనట ఎటువలె నంటేను

# ఉత్తర ప్రత్యుత్తరపు కీర్తన

రా–శంకరాభరణము తా–త్రిపుట

1. ఉ. ఎక్కడ నున్నావు యాదామా - నా
చక్కికి రావేమి యాదామా

2. ప్ర. అప్పు డాదాము బల్కె దేవుఁడా - నీ
చప్పుడు వినవచ్చె దేవుఁడా

3. ఉ. ఎదటికి రావేమి యాదామా - నీ
మదికేమి దోచెనె భేదమా

4. ప్ర. మా నగ్నతలు జూచి దేవుఁడా
సిగ్గైన దాగితిమయ్య యియ్యెడా

5. ఉ. వలదన్న ఫలములు యాదామా - మీ
రెలమి దింటిరేమో చెప్పుమా

6. ప్ర. వినుతోడిచ్చిన యింతి దేవుఁడా - తా
దిని నన్ను తినిపించె దేవుఁడా

తరళ ॥ అప్పుడు దేవుఁడు హవదెసఁగనుగొని
యిప్పుగి దిని నీ వెందుకుఁజేసితో
చెప్పవె యన్నను చేడియ సర్పము
మప్పిన దింటిని మా ప్రభువయనన్ ॥క॥

కం॥ వినిదేవుఁడు సర్పాధమ
నిను శాపము జెందు జంతు నివహములో పొ।
ట్టను బ్రాకెదు కల దినములు ।
మను భక్షించుమని పల్కి మానిని కనియెన్ ॥

మ॥ వనితా నీవు మదాజ్ఞ మీరితివి పాపంబయ్యె నీగర్భ వే
దననే హెచ్చుగఁ జేతు బాధపడి సంతానంబులం గాంతు విం
కను నిన్నేలు మగండు నీ హృదయ కాంక్షల్ నీ ధవాధీన మం
దున నుండంబడు నంచు నింతికి ననంతు డిచ్చె శాపంబొగిన్ ॥

## ద్విపద

ఆ వెన్క సర్వేశు డాదాము జూచి ।
నీవు నా యాజ్ఞను నిలుపంగ లేక ॥
ధైర్యంబుచెడి గురిదప్పి యా పండ్లు ।
భార్య మాటలు విని భక్షించినావు
వసుధ నీనుండి శాపగ్రస్తమయ్యె ।
అసదు లేకయు కష్టమబ్బును నీకు ॥
ఇలను ఉమ్మెతలు ముళ్లిక సంభవించు ।
పొలము కూరలు నీకు భోజనం బగును ॥
చెమట మోమున గ్రమ్మ క్షితిలోన దిరిగి
శ్రమను భక్షించుట సమకూడు నీకు ॥
మంటిలో దీసిన మన్నీవు గావె ।
తొంటి మంటినె గూడి ధూళి యయ్యెదవు ॥
అని చెప్పి దేవుడా యాదాము నపుడు ।
వనములో నుంచి యావలి కంపి వేసి ॥
వ్యవసాయకుని గాఁగ నవనిపైఁబనుప ।
హవ్వయు నాదామిట్టి యాపదల్ బడిరి ॥
భూమికి వచ్చిన మొదటి పాపంబు ।
ఈ మనుష్యులనుంచి యే యిది వినరే ॥

# కీర్తన

రా-పున్నాగతోడి తా-త్రిపుట

అయ్యో నరులారా - పాపము వచ్చె నయ్యో జనులారా । ఇయ్యుర్విలో నాది యయ్యమ్మలిద్దరు బయ్యముచెడి యిట్టి పాపావస్థనుబొంది ॥రయ్యో॥

1. వారి సంతతివల్లా గల్గెడువారు - గారె భూనరు లెల్ల ॥
యీ రీతి తొలి సత్యవేద శాస్త్రమునందు
ప్రారంభమున మోషే వ్రాసి దెల్పెను నిజము ॥అయ్యో॥

2. పెరిగె నీ ధరయందు పాపము సర్వ - నరులడెందము లందు ॥
దరిలేని సంసార శరధి మునింగెడి ।
నపరులాచారము లింక నెరిగింతు నిటమీఁద ॥నయ్యో॥

క॥ ఒక పాపము సేయుటచేఁ
ప్రకటముగ శపించఁ బడిరి ప్రథమ మనుజులే
యిఁ నిప్పటి పాపముకై
సకల జనులకెంత జేటు సమకూడునొకో

॥సీ॥ అనృత వాదులు రోషుల న్యాయశీలురు
పరదూషకులు సురాపాన రతులు ।
పరధన పరదార పర వంచకులు దుష్ట కపట
నిందోత్కట కలితమతులు।
పాషండ చిత్తులు బహుజన ద్వేషులు
నిర్ద యాపరులు దుర్ణీతియుతులు
లుబ్ధ జీవులు మోహలోలులు విశ్వాస
ఘాతుకుల్ కుటిల హుంకారపరులు

తే॥గీ॥ విగ్రహారాధకులు సాధు నిగ్రహులు
పిశాచ ఢాకినీ ప్రేత దుశ్చరిత భూరి।
భూత సేవాతురులు హీన పుణ్యులగుచు
బెరిగియున్నారు నరులిట్లు ధరణిమీఁద॥
మరియును

సీ॥ కలనైన సత్యంబు బలుక నొల్లనివారు
మాయ టక్కుల సొమ్ము దీయువారు
బీదల దండింప పిడుగు పాటగువారు
లంచంబులను పేరు పెంచువారు
కను సన్నజారల గదిసి పిల్చెడువారు
పొరిగింటి సతిఁబట్టబరుచు వారు
తల్లి జెల్లెలు వావి దప్పి వర్తిలువారు
విధవలతో పొందు వెదుకువారు
తే॥గీ॥ కన్నములు వేయ సమయముల్ గనెడువారు
తెరవులను బోయి తలగొట్ట దిరుగువారు
తల్లిదండ్రుల గెంటుచు దరుమువారు
నన్ని తట్లను భూవి నిండి రధికముగను

॥మరియును॥

ఉ॥ ముక్కు మొగంబు లేని కడుమోటగు రాతికి గొంద రంధ్రములన్।
ద్రొక్కుచు చెక్కలూడ్చి యొకరూపుగ జేసిన కర్రముక్కకున్।
పెక్కగునగ్నిలో నుడక బెట్టిన లోహపు బొమ్మకున్ భువిన్।
మ్రొక్కుచునుందు రిట్టి నర మూర్ఖుల పాపము లెన్న శక్యమే

॥గీ॥ వారి పెదవుల క్రిందుండు పాము విషము।
వారి యంగుళ్ళు తెరుచు సమాధులట్ల
వారి నోరుల చేంతి శాపంబు గలదు
వారి జహ్వాలు గపట దుర్వర్తనములు

॥మరియు॥

గీ॥ వారి పదములు హత్యకై వడిగబరచు
వారి తెరవున క్షయము నవస్థ యుండు
వారిలో దేవభయము రవంతలేద ।
టంచు దావీదు మున్ను శోధించి వ్రాసె ॥

## కీర్తన

రా–సారంగమధ్యమావతి తా–త్రిపుట

ఇకనేమి గతియున్నది – మానవులారా – ఇకనేమి
గతియున్నదీ–పాపులకొరక కింక నేమి గతియున్నది ॥
ఒకండైన పుణ్యాత్ముండుర్విలేడని ముందె
ప్రకటించి దావీదు బలికె వేదమునందు॥నికనేమి॥

1. ఇల రక్షకుండు లేకనూ – గొఱ్ఱెల కదుపులు చెల్లా చెదురాయెను
పులుల బోలిన దైవములు గురువులు బెక్కు
గల రేల వారి సంగతి మంచి గతి గాదు ॥ఇక నేమి॥

2. దురితము లణగించనూ – పాపులనెల్లందరిజేర్చి బ్రతికించనూ ॥
పరమేశ్వరుండు దయాభరితుండై ధరకంపె
వరపుత్రుడగు క్రీస్తు శరణు జొరక యున్న ॥ఇక నేమి॥

కII యిది సృష్టి వివరమనియెడు
మొదటి ప్రకరణంబు జదువు బుధ జనములకున్
తుద మొదలు లేని దేవుడు ।
ముదమగుంతెలివిచ్చు గాక మోక్షార్థులు గాన్ ॥

## మరియును రక్షణోపాయంబనెడు రెండవ ప్రకరణం బెట్టిదనిన

కII మత్తేయు మార్కు లూకా ।
యుత్తముండై వెలయు నట్టి యోహానుందున్
మొత్తముగ క్రీస్తు కథ స
ర్వోత్తమముగ వ్రాసి యుంచి రొకరొక రెలమిన్ ॥శా॥

శాII ప్రాణాధారము నిత్య జీవన పవిత్రక్షీర పూరంబు ని।
ర్వాణా నందరసైక గీతము కృపా వర్షాభ్రఘోషంబు క।
ల్యాణో త్కృష్టము క్రీస్తు యేసు గుణ సల్లాప ప్రసంగంబు నా।
త్రాణోపాయమువచ్చె ధారుణికి మర్త్యశ్రేణి రక్షార్థమై ॥

## భుజంగ ప్రయాతము

మహీమండలిం బూర్ణమై పాపముండన్
సహింపంగ రాకుండి సర్వేశ్వరుండున్ ।
మహా సత్కృపన్ దీనమర్త్యాళిగావన్ ।
వహించే పరిత్రాణ వాగ్దత్త మిచ్చెన్

# కీర్తన

రా–పంతురావళి తా–జంపె

ఇదిగో శుభద్రత్రాణము – దేవుఁడు బంపె నిదిగో శుభద్రత్రాణము సదమలంబుగ పూర్వ సత్యవేదమునందు మృదువుగా దీర్ఘదర్శులచేతఁబలుకబఁడె ॥నిదిగో॥

1. అల పిశాచము తోడనూ దేవుఁడు తొల్లి – పలుకు వాక్యము జూడనూ పొలతి సంగతి నిన్నుఁ తలఁగొట్టఁబుట్టునని తెలియ జేసెను మోషే దీర్ఘదర్శన వాక్య ॥మిదిగో॥

2. ఘనదివ్య బలిసేయనూ పాపము లెల్లఁదునిమి పుణ్యము లియ్యనూ ఒనరయీాయీా కాలమున క్రీస్తు వచ్చునని మును దానియేలు బల్కెను దీర్ఘ దర్శనము ॥ఇదిగో॥

3. యూద రాజ్యము లోపటా బేత్లెహేమనెడి – యూర క్రీస్తుని పుట్టుటా ॥ ఆదిలోనను మీాఖా యను దీర్ఘ దర్శిచే మోదమునఁ దెలుపఁబడె మొదటి వేదమునందు ॥నిదిగో॥

4. మన దోసముల కోసమై। యేసుని మేను – మరి గాయ ముల హ్రస్వమై ॥ మన రక్షకుని పాట్లు గనినట్లు లేషయా మును దెల్పె దీర్ఘ దర్శన వాక్యముల నిక్క ॥మిదిగో॥

గీ॥ రక్షకుఁడు భూమిపై పుట్టరాక మున్నె।
దీర్ఘదర్శు లచే నాది దేవుఁడిట్లు
తెలియఁజేయించు వాక్యముల్ దిట్ట ముగను।
ప్రబలి నెరవేరె భువిసాధు వర్గమలర ॥

అది యెట్లంటేని -

గీ॥ ఆబ్రాహాము సంతతులు యూదులనెడువారు ।
వారి కధిపతి దావీదు వాని వంశ
మందు యోసేఫనెడివాని కమరనిశ్చి
తార్థ మొనరించఁబడె నొక్క యలరుబోడి ॥

వ॥ మరియును సౌజన్యమాన్యయగు నక్కన్యకామణి పురుష సంగమం బెరుంగకున్న యెడ నొక్కనాఁడు

శా॥ శుభ్రంబైన దగద్ధగ ప్రభలతో జూపట్టు వస్త్రం బుతో
నెభ్రాంతర్వర మార్గవర్తియయి త్రాణారంభమున్ దెల్పగా
విభ్రాంతిన్ వనజాక్షి కన్య మరియా వీక్షించు చుండన్ న్వెసన్
గాబ్రీయేలను దూత వచ్చెనట మోక్ష స్వామి ప్రేరేపణన్

# దరువు

రా-ఆనందబైరవి తా-త్రిపుట

వచ్చి గాబ్రియేలు బల్కెనూ - మరియ మచ్చ కంటి డెంద ముల్కనూ । మెచ్చైనా శుభములు మితిలేని కృప దేవుఁ డిచ్చి యింతులలో ని హెచ్చు జేసెనటంచు ॥వచ్చి॥

1. భయమాత్మలో వీడు కన్యకా। నీవు - దయబొంది యున్నావు ధన్యగా ॥ రయముగా నిదిగో గర్భము దాల్చెదవు పుత్రో దయమై నేసుపే రతని కిడు మంచును॥వచ్చి॥

2. అతడెన్నఁబడును మాహాత్ముడై । సర్వోన్నతుఁడైన వాని కుమారుఁడై హిత మొప్ప దేవుఁడున్నతిఁజేసి దావీదు వితత సింహాసనమిచ్చు నాతని కంచు ॥వచ్చి॥

3. ఘనమెక్కువగువాని రాజ్యము అంత మొనఁగూడదది నిత్య పూజ్యమూ ॥ నెన రొప్ప యాకోబు నిజవంశ మెపు దేలుకొను నాతఁడనుచు దెల్పెను దూత మరియతో ॥వచ్చి॥

చం॥ అనునెడ వాని తట్టు మరియా మరి తాఁదగఁజూచి బల్కెనో
ఘనమగు వాడనే పురుషుఁగానని దాన నిదెట్లు సంభవిం
చును వెస దెల్పవే యనుచు సుందరి ముందటి కార్య మెంచి ప్రే
మను దను వేడ దూత యను మానము మాను మటంచు నిట్లనెన్

క॥ పరిశుద్ధాత్మయు నీపై।
తిరముగ దిగివచ్చు పరమ దేవుని బలమున్
మరినీడ గప్పు నిమ్మెయి।
పరిశుద్ధోత్పత్తివలనఁబడసెదు సుతునిన్

॥వ॥ అని మరియును దేవుని కసాధ్యంబైన కార్యంబెద్దియు లేదని ముద్దియ కెరుంగంజెప్పి దూత యంతర్హితుండయ్యె నయ్యెడ

## కీర్తన

రా-సౌరాష్ట్ర తా-త్రిపుట

ఆనందమయ్యెన్ - కన్యకచిత్త మానందమయ్యెన్ ఇంతికి డెంద మానందమయ్యెన్ దాని మతిలోని యనుమానములు మాని ॥ యానందమయ్యెన్॥

1. కారుణ్యముగనూ । దేవుడు తన కీఘనమిచ్చె తగను గేరిసుకుమారి మది కోరికల మీరి ॥యానందమయ్యెన్ ॥

వ॥ ఇట్లానందంబున సుందరీరత్నంబు దనయందు దీన జన బాంధవుండగు నందనుం డుదయించునని యెదురు చూచుచున్నయెడా

# ద్విపద

అలదూత సెప్పిన యా చందమునను ।
కలికి శుద్ధాత్మచే గర్భంబు దాల్చె ॥
నది జూచి యేసేపు దాశ్చర్య మొంది ।
సుదతికి నెబ్బంగి చూలయ్యె నొక్కొ ॥
యని మది జింతించి యా నీతి పరుఁడు।
వనిత నిందించ నోర్వక రహస్యమున।
పరిహరించుట కాత్మ భావించుచుండ ।
సరగ దూతయ వచ్చి స్వప్నంబునందు ॥
దావీదు రాజనందనుఁడ యేసేఫ ।
నీ విచారము మాని నిజమింక వినుము ॥
మరియ యా విమలాత్మ మహిమనుఁగాదె ।
ధరియించె గర్భంబు దైవాజ్ఞనుంచి ॥
తనయుని గాంచు నాతనిచేత పుడమి ।
జనులకు రక్షణ సరణి ప్రాప్తించు ॥
ననిదెల్పి చనిన యాయన యంత లేచి।
మనసుబ్బి యేసేపు మాన్యత తోడ ॥
ప్రథమ పుత్రునిగాంచు పర్యంత మతఁడు।
మధురోష్ఠిఁగూడక మర్యాదజేసె ॥
అంతట బెత్లెహేమను గ్రామమునకు ।
కాంతతోడనెఁబోయె కార్యవశ్యతను ॥
వారలిద్దరుబోవు వరగ్రామమందు ।

దారిద్ర్యమున మంచి స్థలమబ్బకున్న ॥
పసులదొడ్డిని వారు బస జేసియుండ ।
బ్రసవ దినంబయ్యె పంకేజముఖికి ॥
ధరనేషయను దీర్ఘ దర్శి పూర్వమున ।
యెరుగఁదెల్పిన వాక్య మీడేరె నపుడు ॥
కడువేడ్క కన్యకా గర్భమునుండి ।
బొడమె యిమ్మానుయేల్ బుడుతఁడాపేరు ॥
మనలతో దేవుడు మహినుండె దాని ।
ఘనతరార్థము దీని గాంచరే జనులు ॥

## కీర్తన

రా–సురటు తా–త్రిపుట

ఉదయించినాఁడు - క్రీస్తుడు నేఁడు ఉదయించినాఁడు మదిరాక్షి మరియా సంభవుడై యిమ్మానుయేల్ సదఁయుడై జనుదెంచి పృథివికి నొదవసమ్మద మల పిశాచికి మదమణంగను సాధు జనముల హృదయముల ముదమెదుగు నట్లుగ ॥నుదయించినాఁడు॥

1. ఏ విభుని వలనా - యీ జగమయ్యె నా విభుఁడీ యిలనూ ॥ దైవత్వమగు మానుష్యావతారము దాల్చి - జీవులకు జీవనమునై నిజ దేవుఁడును తానొక్కఁడై చిరజీవి యగు ప్రభుపాపి జీవులఁగావ తన చావునకు నొడబడి ॥యుదయించినాడు॥

2. యూదుల నడుమన్। పెక్కగుబేదాభేదముల్ బొడమన్॥ వాదించి ప్రభురాక గాదంచు కనిపెట్టి – మీదుఁజూచిన వారి కాతఁ డ నాదరణుండై యన్య జనులకు – వొాదమిగు రొత్తంగ మనకొరకై దయాళుఁడు ప్రాణ మిడుటకు ॥నుదయించినాడు॥

సీ॥ అంతట బేత్లెహేమను ఊరి పొలములోపల
రేయి గొఱ్ఱె మందలనుఁగాచు
కొని గొల్ల బోయలు కొందరుండంగ
ప్రత్యక్షమై యటవచ్చి మోక్ష దూత।
యో గొల్లలార మీ రొప్పార మది భీతి విడిచి
యీ శుభవార్త వినుఁడు సర్వ।
జనుల కత్యానంద మొనఁగూడ దావీదు
పట్టణంబున క్రీస్తు పుట్టినాడు ॥

తే॥గీ॥ చూడఁబొండంచు నానావాల్ చొప్పుదెలిపి।
దూత పరలోక సైన్యంబు తోడ గూడి ॥
మహిమ దేవునకును దయ మనుజులందు।
బలు సమాధాన మిలనింకఁగలుగు గాక ॥

క॥ అని దూత గణము దేవుని।
వినుతి యొనర్చుచును మీది కేగిన పిదపన్
విని గొల్ల లొకనితో నొక
దను మోదము లలరమాట లాడిరి బోవన్ ॥

అది యెట్టంటేని-

## దరువు

రా-ఆనందబైరవి తా-త్రిపుట

రారె గొల్ల బోయలారా - నేటి రాత్రి బేత్లెహేము వూర। కోరిమోక్ష దూత చేరి దెల్పెను క్రీస్తు వారిజాడ కన్నులార జూతము వేగ ॥రారె॥

1. పుట్టు చావులు లేని వాడట పనుల – తొట్టి లోపల బుట్టినాడట యెట్టి వారలను జేపట్టి పాపము లూడ గొట్టి మోక్షపు త్రోవ బెట్టువాడట వేగ ॥రారె॥

2. బహుకాలమాయను వింటిమే। నేడు – మహికివచ్చుట గనుగొంటమే విహితము తోడ సేవించి వత్తము మోక్ష మహితుని గని దుఃఖ రహితుల మవుదము ॥రారె॥

## మాలినీవృత్తము

అంచు నాగొల్ల లట్లప్పుడే వచ్చి వీ।
క్షించిరా చంచలాక్షీసుతున్ యేసునిన్।
మించి బూజించి ప్రేమించి మన్నించి వ।
ర్ణించుచుం బోయి రెంతేని మోదంబునన్॥

తరళ॥ అంతట బండితు లరయుచు బూర్వ ది।
గంతర మునమండచ్చోటికి బ।
ల్వింతగ వచ్చిరి వెసనక్షత్రము।
కాంతిగ తమ ముంగట గతిజూపన్॥

గీ॥ జ్ఞాను లానందమున భక్తిమానసముల।
బూని మితి లేని కరుణా నిధానిముక్తి॥
రేని క్రీస్తుని బూజించి కానుక లను
మానవతికిచ్చి యచ్చోటు మరలి చనిరి॥

అంతట

సీ॥ యూదులరాజు హేరోదను నతడు
పాపుల రక్షణార్థమై పుట్టియున్న
యేసు క్రీస్తు మహత్వ మెరుగక తనకు
మించిన రాజు పుట్టెగా యని తలంచి
వెదకి చంపుటకాజ్ఞ వెట్టిన యోసేపు
దూతచే వినిదేశ దూరుడగుచు।
హేరోదు చచ్చుట యెరిగి సుతుండు
పత్నియు దాను గలిలయ్య దేశమునకు

తే॥గీ॥ వచ్చి నజరేతు పురమందు వాసమమర
జేయు నప్పుడు యేసు యోసేపునకును
తల్లికిని న్యాయ విధులందు దనిపి పాప ।
రహితుడై వృద్ధిబొందెలోక విహితుడగుచు ॥

## కీర్తన

రా॥ముఖారి తా–ఆది

వినరే నరులారా మనముల వేడుకలను మీర । మన రక్షకుడగు మరియా తనయుని మహిమలు చెవులార ॥

1 తనకంటెను ముందూ యోహానను వా డిలయందూ ॥ ఘనతరమగు దీర్ఘదర్శనము బల్కెను పొందుగ ముందు ॥ వినరే నరులారా ॥

2. ఆతడు యోర్దానన్ । నదిలో – ఖ్యాతిగ స్నానంబున్ ॥ పాతకులకు బాప్తిస్మమిచ్చునెడ । ప్రభువచ్చుటికరిగెన్ ॥ వినరే నరులారా॥

3. న్యాయము నిలుపుటకై। ప్రభువు విధేయత గనుపరచీ ॥ శ్రేయఃపతి బొందెను యోహానుని । చేతను స్నానంబున్ ॥ వినరే నరులారా॥

4. పరమండల మపుడూ । తెరవంబడి పావురముగతిన్ ॥ పరిశుద్ధాత్మ శుభప్రభలీనుచు । ప్రభువుమీద వాలెన్ ॥ వినరే నరులారా ॥

5. ఆకాశమునుంచి। గలిగెను ప్రాకటమగు రవము ॥నా కితడు ప్రియంబౌ కుమారుడా। నంద మొందితనుచూ ॥ వినరే నరులారా॥

6. అంతట మనకర్త। పరిశుద్ధాత్మ బలము కలిమిన్ ॥ సంతోషిత మోక్షకుశల వార్తను। జాటంగను దొణగెన్ ॥ వినరే నరులారా॥

క॥ పన్నెండుమంది -శిష్యుల।
నెన్నికతోగూర్చి కర్త యింపుగనొక నా ।
దున్నతమగు గిరిపై గూ ।
ర్చున్న తరిని వారికిట్టు లుపదేశించెన్ ॥

# కీర్తన

రా-ఎదుకులకాంభోజి తా-ఆది

ఎవరు భాగ్యవంతులౌదు రవనిలోపలా - మోక్ష విరవమైన క్రీస్తుబోధ చెవులొగ్గి వినువారికన్న ॥ఎవరు॥

1. కవులు లాభమరసి చేయు కపటమంత్రముల్ । విధులు దవుల బోవదరిమి యేసు తత్వము గొనువారికన్న ॥నెవరు॥

2. దీన మానసుల కిట్టి యుపదేశమిచ్చెను । దివ్యమైన మోక్ష రాజ్యము వారి దౌనటంచు ప్రభువు దెల్పె ॥నెవరు॥

3. వృజినములకై దుఃఖించేటి సుజనులెవ్వరో । వారు-నిజ ముగా నోదార్పు పొంది-నిత్యసంతోషితులని తెల్పె ॥నెవరు॥

4. శాంతినీతి కరుణలయందాసక్తిగలవారు। భూస్వతంత్రులై పరితృప్తినొంది దయ బడసెదరని ప్రభువు దెల్పె ॥నెవరు॥

5. పరిశుద్ధహృదయులు పరాత్పరుని జూతురు । సర్వనరుల సమాధానపరుచు-నరులే పరమతండ్రి సుతులు ॥ ఎవరు॥

6. నీతికొరకాపదనొందేటి నిశ్చలాత్ములు । వారు ఖ్యాతిగా పరలోక రాజ్య ఘనసౌఖ్యము లెల్లను బడయుందురు ॥ ఎవరు భాగ్య ॥

వ॥ మరియును వివరించెద-

## దండకము

శ్రీ నిత్యమై సత్యమై సాధు సంస్తుత్యమై సంతతౌన్నత్యమై సర్వలోక ప్రశస్త ప్రభానిస్తులంబైన క్రీస్తు ప్రభోధా సుధా మాధురీ భాషితంబుల్ ప్రధానంబుగా సత్యవేదంబులో నున్నరీతిన్ గడుం బ్రీతితో కొన్ని నేనెంచి విన్పించెదన్ మర్త్యులారా ముదంబార మీరాలకించఁగనే గోరికన్ సారెకున్ వేడెదన్ జిత్తగించండి యట్లేసు నాథుండు నాకొండపైనుండి పన్నెండుమండ్రైన యాకోబు యోహాను సీమోను పేత్రుండ్రుడున్ బర్తలోమింక మత్తేయు తోమాసు యల్ఫై కుమారుండు యాకోబు జేలోటియన్ వేరెసీమోన్ ఫిలిప్పుండు యాకోబుకున్ సోదరుండౌ యెహూదా మరిన్ ద్రోహుడైనట్టి యిస్కార్యటన్ బిల్చు యూదాసుడున్ వీరలన్ కూరిమిన్ జేరగా బిల్చి యిట్లానతిచ్చెన్ యహో శిష్యులారా మదీ యాజ్ఞలుం బ్రజ్ఞతో గొన్న మీకెవ్వరైనా నబద్ధంబుగా కాని నానా విరోధోక్తులున్ బల్కి నిందింతు రానింద నా కోసమై మోసుకున్నట్టి మీరేకదా భాగ్యవంతుల్ నితాంతాత్మ సంతుష్టులై యుండుడీ మోక్ష రాజ్యంబునం దెక్కుడై మీఫలంబుండు మీరింక నిద్ధాత్రిలో నుప్పులాగొప్పుచున్నా రలయ్యుప్పు నిస్సారమైనన్ మరే దానిచే సారమున్ గాక పారంగ వేయంబడున్ మీరు లోకంబులో వెల్గుగానుండుటన్ జేసి బల్మెట్టపైగట్టు బల్వీడు చాటుండగా వచ్చునే యింక దీపంబు ముట్టించి కుంచంబు క్రిందుంచకన్ దివ్వ గంబంబు పైనుంతు రా వెల్గుచే మందిరంబందు నున్నట్టి వారందరున్

సంతసం బొందుచున్నారు మీరట్లు మర్త్యాళిలో సత్క్రియల్ జూపుడీ నేను న్యాయ ప్రమాణంబునున్ దీర్ఘదర్శోక్తులుం ద్రోయగా వచ్చి నానంచు మీరెంచకండీ యవెల్లన్ దిరంబొప్ప సంపూర్ణమున్ జేయగా వచ్చితిన్ నిశ్చయం బింక నాకాశమున్ భూమియున్ బోవు పర్యంతమిమ్మైన న్యాయ ప్రమాణంబులో జిన్న సున్నైన మాత్రైన నెల్లన్ సుసాఫల్య మౌనంత దాకేదిబోదంచు మీతోడనే జెప్పుచున్నాడ నింకెవ్వరున్ మర్త్యులన్ హత్యగావించరాదంచు పూర్వుల్ దగంజెప్పుటల్ వింటిరే - నేను మీతో వినం బల్కెదన్ నిర్నిమిత్తంబుగా సోదరుంజూచి క్రోధించువాడెవ్వడో యాతడన్యాయియై శిక్షకర్హుండగున్ గాన మీరాక్కాన్క లర్పించువేళన్ భవత్సోదరున్ ముందుగా పొందుచే డెందమానందముంజేసి యావెన్క మీకాన్కలున్ ప్రార్థనల్ దేవతా సన్నిధింజేయుడింకన్ - బర స్త్రీ దురాచారమున్ జేయరాదంచు పూర్వుల్దగం జెప్పిరే - యస్మయోక్తులాలించుడీ కామదృష్టిన్ బర స్త్రీదెసన్ జూచువాడెవ్వడో నాతడయ్యంగ నాసంగమం బంతరంగంబులో జేయువాడే యదింగాన మీ దక్షిణాక్షి స్వభావంబు మీ భక్తి కభ్యంతరం బైనదానిన్ వడిన్ యూడగా దీయుడీ - యెందుకన్నన్ మహాఘోర దుర్వారమౌ నారకాగ్నిన్ సమస్తాంగమున్ గూలగా ద్రోయుట కంటెన్ త్వదీయాంగమం దిప్పుడే యొక్క నేత్రంబు నాశంబు నౌటెంత మీకుత్తమత్వంబునౌ నట్ల మీహస్త మభ్యంతరంబైన దానిన్ వెసన్ గోసియవేసేది మీకుత్తమంబౌ మదీయాజ్ఞ మీ ప్రజ్ఞలందుంచుడీ యెవ్వడేనిన్ స్వభార్యా పరిత్యాగముంజేసి తత్త్యాగ పత్రంబు నయ్యింతి కర్పించుగాకంచు బూర్వుల్దగం జెప్పిరే - నేను మీతో వినంబల్కెదన్ జారకార్యంబు లేనట్టి స్వస్త్రీ పరిత్యాగమున్ జేయువాడెవ్వడో దాని వాడేజుమీ జారగా జేయుచున్నాడు వేరొక్క డాత్యాగినిన్ బెండ్లిగైకొన్న యన్యాయియై వెచ్చకాడై జెడున్ - కంటికిన్ కన్నుగా పంటికిన్ పల్లుగా యీడు కీడంచు బూర్వుల్దగం జెప్పుటల్ న్యాయశాస్త్రంబులో వింటిరే -

నేను మీతో బ్రసంగింతునో శిష్యులారా పగన్ మీయెడన్ కీడు గావించు మర్త్యాళికిన్ మీరలే కీడుసేయంగ బోగూడ దెవ్వారు మీచెంపపై గొట్ట వేరొక్క మీ చెంపనందియ్యుడీ - యిం మీయంగి దియ్యంగ చర్చించు వాడెవ్వడో వాని కవ్వేళ మీ మీది వస్త్రంబు లందిచ్చి నిర్వ్యాజులై యుండుడీ మోక్షమందుండు మీతండ్రికిన్ బిడ్డలైనట్లు మీ శత్రులన్ మైత్రితో నెంచి ప్రేమించుడీ - యింక మిమ్ముమ్ శపించెడి వారెవ్వరో వారి నాశీర్వదించండి మీపై విరోధించు మర్త్యాళికిన్మేలు గావించుడీ - నింద మీయందు గల్పించు వారెవ్వరో మిమ్ము గద్దించు వారెవ్వరో వారికోసం దోసంబు రాకుండ ప్రార్థించుడీ - మీరు మీ యిష్టులన్ మాత్రమే ప్రేమ గావించినట్లయిన దానన్ ఫలంబేమి మీ యన్నలన్ దమ్ములన్ మాత్రమే మీరు చెల్వొందగా వందనంబాచరించన్ ఫలంబందు మీకేమి పాపాత్ములారీతి పాపాత్ములన్ జేయుచున్నారు గారా యహోభక్తులారా సదా మోక్షమందుండు మీ తండ్రి సంపూర్ణుడైనట్లు మీరన్నిటన్ బూర్ణులై యుండుడీ-మీరు ధర్మంబులన్ జేయువేళన్ మనుష్యాళిచే సన్నుతుల్ గోరి సంఘస్థలిన్ వీధులన్ వాద్యముల్ మ్రోల నూదించుచున్ జేయ కుండీ-రహస్యంబుగా నొక్కకై నిచ్చు మీ ధర్మ మింకొక్క చైకించుకంతైన గానంగ రాకుండనీ-యంత రంగంబు వీక్షించు మీతండ్రి బాహ్యంబునన్ మీ కొసంగున్ ఫలం బింక మీ ప్రార్థనల్ వీధులన్ మూలలన్ మూకలో సేయగా బోక నేకాంత గేహంత రంబున్ బ్రవేశించి ద్వారంబులన్ మూసి ప్రేమాంతరంగంబునం దేవునిన్ గూర్చి ప్రార్థించుడి- యప్పుడానందముల్ బొంద మీడెందముల్ జూచు మీతండ్రి బాహ్యంబునన్ మీ కొసంగున్ ఫలంబుల్ మరిన్ దేవుడేరీతి మీదోషముల్ గాచి మన్నించు నట్లాత్మలన్ గోరుచున్నారో యబ్బంగి మీ కెవ్వరున్ దోసముల్ జేసినన్ వారి మన్నించుడీ - మీరు పుణ్యోపవాసంబు చేసేతరిన్ వంచకుల్ మోము వాడించి మర్త్యాళి తమ్మెంచ చూపించుచున్నారు. మీరట్లు

గావించకుండాత్మలో నుండు మీతండ్రి వీక్షించు నట్లొక్క ప్రొద్దుండుడి-మాయయైపోవు నాదాయముల్ గూర్చకండీ - దనంబెచ్చటో మానసం బచ్చటే యుండు నింకన్ వినుండొక్క డిద్రాత్రిలో నిద్దరిన్ సేవగావింపగా నేర. డారీతి మీరున్ సిరిన్ దేవునిన్ గూర్చి సేవింపగా లేరు. కాబట్టి ప్రాణంబుకై. మేనికై యేమి భక్షింతు మేవస్త్రమున్ గట్టుదామంచు చింతింపకుండీ-దివిన్ బారు నాపక్షులన్ జూడుడి వాటిలో విత్తుటల్ గోయుటల్ లేక మీతండ్రిచే రక్షణం బొందలేదా-యహోస్వల్ప విశ్వాసులారా విచారింపనేలా - యెవండైన మీ లోన దానెంత చింతించి ప్రాణంబు నొక్కించు కంతైన హెచ్చించి దానిన్ తనందుంచుకో జాలునే కాన మీ రాదిలో దేవనీతిన్ పరంబైన మోక్షంబు శోధించుడీ-వెన్క మీకేవి యావశ్యకం బైనవో యట్టివెల్లన్ దయన్ తండ్రి మీకిచ్చు నో శిష్యులారా వినుడింక మీ కంటిలో దూలముండంగ దానిన్ గనన్ లేక మీ సోదరున్ జూచి యో తమ్ముడా నీదు నేత్రమ్ములో చిన్న నల్సున్నదే దాని దియ్యంగ మాకానతిమ్మంచు మీరందురా ముందు మీ కంటియందున్న దూలమ్ముపోలాగుడీ పిమ్మటన్ తమ్మునిన్ కమ్మగా జేయవచ్చున్ మరిన్ వేడుడి మీకు నివ్వంబడున్ రోయుడీ మీకు చేకూరెడున్, తట్టుడీ మీకు తియ్యంబడున్-గాన మర్త్యాళు లేమేమి మీ కాచరింపంగ మీ యాత్మలో గోరుచున్నారో మీరట్టులే వారికింజేయడీ -జీవనాధారమైయున్న యా చిన్న ద్వారంబు తోనం బ్రవేశించుడి నారకావస్థకున్ బోవు ద్వారంబు విస్తారమైయుండు నాదారిలో లెక్కకున్ మిక్కిలౌ మానవుల్ బోవుచున్నారు -తోడేళ్ళ భావంబుతో గొఱ్ఱె వేషంబు పైబూని మీ యొద్దికిన్ వచ్చు మిథ్యాభవిష్యత్కథల్ జెప్పువారిన్ విసర్జించుడీ-సత్ఫలంబివ్వలేనట్టి చెట్లన్ వెసన్ గొట్టి వహ్నిన్ బడన్ వేతురింకన్ యుగాంతంబునన్ నన్ను వీక్షించి యోకర్త యోకర్త యట్లంచు జెప్పే నరుల్ మోక్ష రాజ్యంబులోనన్ బ్రవేశింపగా లేరు నా తండ్రి చిత్తప్రకారంబు గావించు వారెవ్వరో వారలే ముక్తిరాజ్యస్థు లింకన్

మదీయోప దేశంబులు న్వించు నారీతి గావించు వారెల్ల గ్రావంబుపై నిల్లుగల్పించు సద్బుద్ధులౌ వారితుల్యుల్ ప్రవాహంబులుం వార్రి ఝంఝా సమీరంబులాయింటిపై దాకినన్ గూలగా నేరదింకన్ మదీయోక్తు లాలించి యాలాగు గావించగా లేనివారెల్ల నిర్బుద్ధులై సైకతా వాలమందిల్లు గట్టించునట్లౌను వృష్టి ప్రవాహోగ్రవాతాహతిన్ తద్గృహంబున్ వెసంగూలు నిట్లంచు సర్వాధికారంబుతో బోధగావించు యేసు ప్రభున్ జుట్టుకొన్నట్టి వారంద రాలించి యాశ్చర్యము బొందిరాకాలమందిప్పుడో మర్త్య బృందంబులారా మహాపాపబంధంబులు న్వీడగా మీరలీదివ్య తత్వోప దేశంబు వాక్కాయ చిత్తంబులన్ శక్తితో సేయగా బూనుడీ నిత్య శాంతంబు మీ స్వాంతముల్ జెంది యా మీదటన్ మోక్షసాక్షాత్పలాక్షీణ సౌఖ్యోన్నతుల్ మాన్యతల్ గల్గు-నోదేవ నేనిట్లు నీపాదముల్ గొల్చి నీ భక్తిలో నిల్చి నీ వాక్యముల్ దాల్చి విశ్వాసినై మానసోల్లాసినై యింక నీ దాసదాసానుదాసుండనై యుండగా గోరితిన్ జేరితిన్ నన్ను రక్షించుమో క్రీస్తునాధా సదా సర్వలోకైక నాధా మహోఘోర పాపౌఘబేధా శ్రీతా మోదపాదా నమస్తే నమస్తే నమస్తే నమః.

## కీర్తన

రా-శంకరాభరణము తా-త్రిపుట

వినరయ్య నరులారా విశ్వాసమున క్రీస్తు వేదబోధ -
పాప మనుజులకెల్ల జీవనపావనము సేయు వసుధమీద ॥

1. పాపాత్ములను పశ్చాత్తాపబడుండంచు ప్రభువు దెల్పెన్ తన్ను దావు గోరిన వారి కాపాడుటకు తానే దైవమయ్యెన్ ॥వినరయ్య॥

2. భారాక్రాంతులైన పాపిష్ఠులను చేర ప్రభువు బిల్చెన్ శ్రమలు - దూరంబుజేసి తద్దురితముల్ బాపి సంతోషమివ్వన్ ॥వినరయ్య॥

3. అనుమానించక యెవ్వరైన వచ్చిన ద్రోయననుచుబల్కెన్–పెక్కు – మనుజులకొరకు జీవనమియ్యనే వచ్చి తనుచు దెల్పెన్ ॥వినరయ్య॥

4. సర్వాంతఃకరుణతో సర్వేశ్వరుని ప్రేమ సలుప దెల్పెన్ ఇంక–నుర్విలో తనపోల్కె నొరులను బ్రేమించ నుక్తి జెప్పెన్ ॥వినరయ్య॥

5. తన శిష్యులకు నైక్యతను బ్రేమించుట కాజ్ఞలొనర నిచ్చెన్ – ఎంతో – ఘనుడైన ప్రభు కాళ్ళుకడిగా భక్తుల చోట వినతుడయ్యెన్ ॥వినరయ్య॥

క॥ ముదమున లూకా వ్రాసెదు ।
పదియేనవ పర్వ మునను పాపాత్ముడొకం ।
డెదలో బశ్చాత్తాపము
నొదవు విధము కర్తదెలిపె నుపమానముగన్

వ॥ మరియు ననేక విధంబులైన యుపమానంబులతో హితోపదేశంబు లిచ్చు నెడ యూదదేశంబు నంగల వేదోపదేశకులు సహింపక.

క॥ ఇప్పటి చెడుగురువుల వలె ।
నొప్పక పరిసయ్యులు ప్రభుని యుపదేశములన్
దప్పులు వెదుకను దిరిగిరి
నిప్పుదరిం దిరుగు శలభ నివహము బోలెన్

వ॥ మరియు నిట్లనేకంబులైన యుపదేశంబులిచ్చునెడ దన దేవత్వం బేర్పడ నద్భుతంబులు గావించె నవి వివరించెద

సీ॥ అంబువుల్ ద్రాక్షా రసంబుగా నొనరించె
శరధిపై నడిచి తెమ్మె రను నిలిపె
జన్మాంధులకు జూడ చక్షువుల్దయనిచ్చె
బధిరులకును వినంబడగజేసె

బహు రోగులను స్వస్థపరిచె మూగవారల
మాటలాడించె రమ్యముగను ।
పెనుభూతముల చేత బీడింపబడువారి
విడుదలగావించె విశదముగను ॥

తే॥గీ॥ నైదువేల్మర్త్యులకు రొట్టెలైదు విరిచి
భోజనము దృప్తి పరిచి తద్భుక్త శేష
మైన తునుకలు పదిరెండు నమరు గంప।
లందు నెత్తించె నతులితానంద మూర్తి ॥

మరియును,

క॥ జేరసుడను శిష్టుని యొక ।
కూరిమిగల కన్యవ్యాధి గూలినదానిం ।
జేరి చెయిపట్టిలేపి సు।
ధీరుడు బ్రతికించె సన్నుతింపగ జనముల్ ॥ మరియును,

గీ॥ ఒక్క విధవరాలిక్నువా డొక్కడే ।
ముద్దుకొడుకు వాడు పెద్దనిదుర ।
బోయియున్ననటకు బోయి వానికిజీవ
మిచ్చె నీ విచిత్ర మెంచ దరమే ॥

# కీర్తన

రా॥ శంకరాభరణము — తా–ఆది

వినరె మనుజులార క్రీస్తుడిలను చేయు చోద్యమైన
పనులలోన ఘనమిదొక్క పని వచించెద ।

1. మనమనంబు లలరుచుండ దినదినంబు ప్రభుని నిండు ఘనమహోద్భుతములు వినిన తనివి దీరతు ॥ వినరె॥

2. ఇలను బేతనియ పురంబు గలదు మరియ మార్తలక్క జెలియలందు వాసముండి రెలమితోడను ॥వినరె

3. పరిమళంపు తైల మేసు చరణములకు బూసినట్టి మరియ సోదరుండు రోగ బరితుడయ్యెను ॥వినరె॥

4. వ్యాధిచేత లాజరుండు బాధనొందుచుండ క్రీస్తు నాథు బిలువనంపి రపుడు నాతులిరువురు ॥వినరె॥

5. తమ్ముడక్క జెలియులను ప్రియమ్ము తనకు గలిగియుండ నమ్మహాత్ముడైన క్రీస్తు దరిగె నచటికి ॥వినరె॥

6. యేసువచ్చు టెరిగి మార్త యెదురుగాను బోయి తనదు దోసిలొగ్గి మ్రొక్కి ప్రభువుతోడ బలికెను ॥వినరె॥

7. కర్త నీకు దేవుడిచ్చు ఘన మెరుగుదు నీవు సత్య వర్తి విచటలేని కతన వ్రాలె లాజరు ॥వినరె॥

8. పిదప మరియ వచ్చి క్రీస్తు పదయుగముల కొరిగియేడ్చి మొదట మార్త పలికినట్లు సుదతి బలికెను ॥వినరే॥

9. అపుడు కర్త వారిపలుకు లాలకించి మదిని మూల్గి కృపకు పాత్రురాలితోడ నపుడు నడిచెను ॥వినరె॥

10. నడిచి లాజరుని సమాధి కడకుజేరి గుహనుమూయబడిన రాయి తియ్యుడనుచు ప్రభువు జెప్పెను ॥వినరె॥

11. యేసుతోడ మార్తబలికె నీ సమాధి నునిచి నాల్గు వాసరంబులయ్యె కంపు పట్టియుండదా ॥వినరె॥

12. దాని నమ్మిచూడుమని మహానుభావుడాత్మ బలము నూని తండ్రినపుడు స్తోత్ర మొనరజేసెను ॥వినరే॥

13. లాజరూ సమాధి వెడలి రమ్ము లెమ్మటంచు లోక పూజితుడు మహారవమున బొబ్బ పెట్టెను ॥వినరె॥

14. మరణమైనవాడు ప్రాణ భరితుడగుచు లేచి వచ్చె తరుణు లెంతో హర్షులైరి పెరజనంబుతో ॥వినరె॥

15. కన వినంగరాని యిట్టి ఘన మహాద్భుతంబు జూచి జనులు కొంద రేసునాధు ననుసరించిరి ॥వినరె॥

క॥ మరియు నొక పుట్టుచీకుని ।
తెరువున జని ప్రభు వతనికి దృష్టియొసగు స।
చ్చరితము వివరంబుగ మీ ।
కెరిగించెద మర్త్యులారా యింపుగ వినుడీ ॥

## కీర్తన

రా–నవరోజు తా–త్రిపుట

అందమైన క్రీస్తుకథ మీరాలించరయ్యా ।

1. పొందుగా శిష్యులతో గూడీ పోవుచుండే మార్గమందు ముందటా వీక్షించి రొక్క పుట్టుగుడ్డిని ॥ అందు కొందరు శిష్యులాత్మలో భావించి రెందు కీతడు చీకయ్యెను దీని విధమేమో । డెందములను గల్గు సందియములు వీడా । విందామనుచు లోక వంద్యుని సంతతా । నందుని మరియానందనుని యడిగిరపుడు ॥అందమైన॥

2. చీకువాడై జన్మించుటకు జేసెనా దుష్కృత మీతండూ లేక వీని జననీజనకు లేమి జేసిరో ॥ఈ కారణము దెల్పు మోకర్తా యిపుడీవు ।మాకంచు

తనువేంద లోకేశ్వరుండుని। రాకారు డితనియం దీకార్యములు జూప। ప్రాకట మొనరించె గాక వేరొక విధము। లేకున్న దని తెల్పి చీకు ట్రోవదలంచె ॥అందమైన॥

3. బురదవానీ కన్నూలందు కరములతో జమిరీయొక్క చెరువులో బ్రక్షాళించుటకు సెలవిచ్చె ప్రభువూ। బిరబిరనయ్యందు దరిగి యేసుని పల్కు। తిరముగ మదినమ్మి సరసిలో మునిగి సుందరమైనా నేత్రముల్ ధరియించి యానంద। భరితుడై జనుదెంచు తరివాని పొరుగింటి। నరులబ్బురముగ జూచిరి మార్మోమగు వాని ॥అందమైన॥

క॥ అప్పుడు పరిసయ్యులు తమ।
గొప్పతనంబులకు హాని గూడు నటంచున్
నిప్పులు ద్రొక్కెడు గతి మన
సొప్పక ప్రభుపై విరోధ మూహించి రొగిన్ ॥

వ॥ ఇట్లోర్వజాలక పరిసయ్యులు పూర్వాంధత వదలి యున్న వానిం జూచి గర్వాంధంబున నిట్లనిరి.

## ఉత్తర ప్రత్యుత్తరపు కీర్తన

రా–శంకరాభరణము                                   తా–త్రిపుట

అవురా నీకు కన్నులిచ్చె నెవడో వాడు నేడు సబతు దివసమంచు మదిలో నెరుగడా। జన్మాంధవాని – భువిని మా బోటివారెంతురా ॥

1. గుడ్డి. బురద నా కన్నుల కలదిబోయి సీలొామనెడి సరసిని త్వరగ నన్ను కడుగుమనియెను। పరిసయ్యూలారా – వాని పేరు యేసు క్రీస్తటా ॥

2. పరి. ఈ విధముగా జేయువాడు దేవునినుంచీ వచ్చిన భావము మాకేమిదోచదు। జన్మాంధవాడు – దైవదినము గైకొనలేదూ ॥

3. మరికొందరిట్టనిరి – యతడు దురితుడైతే యీ యాశ్చర్య పరమకార్య

మెట్లు జేసీనీ । యంచువారితో - బలికిరి భేధముతోడను ॥

4. పరి. పరిసయ్యూలు గుడ్డివాని మరలి యనిరి నీ కన్నులు తెరవజేయు వాని గురించీ । జన్మాంధనీకు తెలియబడిన దేమి జెప్పుమీ ॥

5. గుడ్డి. అతడు ఘనమౌ దీర్ఘదర్శియయ్యున్నాడంచు నిక్కముగ మతిని నాకు దోచుచున్నదీ । పరిసయ్యులారా మనుజమాత్రుడనుకోకూడదు ॥

6. దాని వినక వారు గుడ్డివాని తల్లిదండ్రులను బిలిచీ । వీనికి చూపెట్లుగలిగెనూ - మీ తనయు డంధుడైనవాడు చెపుడీ వీడేనా ॥

7. పుట్టంధుడై జన్మించు మా పుత్రుడితడే కనులు వీనికెట్టులబ్బెనో మేమెరుగమూ । సరిసయ్యులారా - యెవరు వీనికక్షు లిచ్చిరో ॥

8. పడుచువాడై యుండే వీని నడుగుండని యూదూలందు । కడుభయమునా దెల్పకుడీరీ ॥ క్రీస్తనెడివారి - కడకు ద్రోయానియమించుటాను॥

9. పరి. తిరిగీ పరిసయ్యులా చీకునరునితో దేవునీ మహిమా । పరచుమింకా నీవూ జెప్పేటీ ॥ జన్మాంధా వాడూ-దురితుడానీ మే మెంచేదము॥

10. గుడ్డి. అతడు పాపుడౌనోకాడో యదియు నే నేరుంగానిప్పూ। డతనివల్లా కన్నూలబ్బెనూ ॥ పరిసయ్యూలారా - యితరమేలా యిది నా కెరుకయ్యెన్ ॥

11. పుట్టు గుడ్డీవాని పాటి బుద్ధీలేక పరిసయ్యూలు । బట్ట బయలై గన్పట్టూచున్నా ॥ యేసునాధునీ - పరమకార్యము లోప్పారైరి ॥

12. పరి. సారేసారే కంధజనుని వారాలడిగీ రింకావాడు । యేరీతిని నీ కన్నూలిచ్చెనూ ॥ ఓరీ జన్మాంధా - ఏమిజేసే నెట్లు బలికేనూ ॥

13. గుడ్డి. విసువూతో వాడనియే మీరూ వినుచూ విననట్లడిగేదారు। పొసగ క్రీస్తు శిష్యులౌటకా॥ పరిసయ్యూలారా-బుద్ధిలో నూహించుచున్నారా ॥

14. పరి. కోపమూనా పరిసయ్యూలాగుడ్డీవానీ తిట్టీ నీవే పోపో వానీ

శిష్యుడవుగానూ॥ ఓరి జన్మాంధా - బుద్ధి హీనుడవునీవే కమ్మూ ॥

15. పరి. మోషే మాకు గురువు గలడూ ముఖ్యాడతనీ మే మొంచుదుము । వాసిగా వీ డెక్కాడీవాడో ॥ ఓరీ జన్మాంధా వానినీ మే మెరుగాకున్నాము॥

16. గుడ్డి అతనీ మీరు యెరుగామనుటా యాశ్చర్యాామూ గాదే నాకీ॥ గతిని కన్నుదోయీ తెరిచేను ॥ పరిసయ్యూలారా ఘనములేనివాడై యున్నాడా ॥

17. గుడ్డి. పాపాత్ములా మనవీ వినడునె పరమేశ్వరూడనుచూ మనకు । యాపాటైనా దెలియకుండూనా ॥ పరిసయ్యూలారా యేమి చోద్యాము మీ మాటలూ ॥

18. గుడ్డి. లోకారంభమునుంచీ యిం దాకా నెవ్వాడైనా పుట్టు చీకువానీ నిట్లా జేసేనా ॥ పరిశయ్యూలారా - జెప్పుకొనుటా మీరూ వింటిరా ॥

19. గుడ్డి. నిక్కామితడూ దేవూని సన్నిధినుంచీ వేంచేసినాడూ । తక్కినా వాడిట్లూ చేయునే ॥ పరిసయ్యూలారా - తగిన రక్షాకర్తయితడేను ॥

క॥ అది విని పరిసయ్యులు దు ।
ర్మదులై యని రోరిదుష్ట మనుజాధమ నీ ।
మది బితుకు లేక బోధిం ।
చెదవా మా కెదుట నిలువ జెల్లునె నీకున్ ॥

క॥ అని కినిసి వాని వెలపటి ।
కిని జన దరుమంగ వాడు క్రీస్తునికడకున్।
జని విశ్వసించి సేవిం।
చెనువినరే మనుజులారా చిత్తములలరన్॥

వ॥ అనంతరంబు మరియానందనుండు ముందట వచ్చుతన పాట్లు దలంచి శిష్యులతో జెప్పందొణంగెడు విధం బెరింగించెదా.

# కీర్తన

రా–ఆనందభైరవి తా–ఆది

యేసు శిష్యులకు నెరుకజేసిన భవిష్యోక్తులు వినరే. కైసారియ నగర ప్రాంతములను ఘనుడు జేరి తన గతి మతి దలచుచు ॥యేసు॥

1. యెరూసలేమనెడి పురమున దనకిక దొరికెడి దుఃఖ్ఖములూ । దురితాత్ములు యూదులు కడుబాధలు పరిచి తన్ను సిలువను జంపుదురని ॥యేసు

2. నీతి పాఠకులనేకులు పెద్దలు ఖ్యాతిగ నర్చకులు । ఆతరి తన నపహాస్యము లాడుచు వోతరించి యుమివేతురటంచును ॥యేసు॥

3. మనుజకుమారుడు మరణమై సమాధిని వేయంగబడున్ తనరగ మూడవ దినమున పునరుత్థానుడగుచు దర్శనమిడు మీకని ॥యేసు॥

వ॥ ఇట్లెరిగించి యనేక విధంబులైన పరమాద్భుతంబులును మోక్ష సాధనీయంబులైన బోధలును గావించు మనుష్యావతార ధారియగు జగదుపకారియెడ నెడతెగరాని వైరభావంబులు గల దుర్వార శౌర్య మాత్సర్య ధుర్యులగు ప్రధానాచార్యులును నిరంతర్మాస్తవ, పరదూషణ విచారణీయులగు పరిసయ్యులును ప్రశాంత సుజన బాధా క్రియానుమోదులగు యూదులును సహింపలేక గుంపులు గూడి తెంపుచేసి చంపుట కాలోచించి సమయంబు విలోకించుచున్న యెడ క్రీస్తుని ప్రశస్తంబైన ద్వాదశ శిష్యులయందు లోభగ్రస్తుండైన యిస్కార్యటి యూదాసుండొక్కనాడు.

చ॥ తనగురు దేవుడైన పరతత్త్వసుధాంబుధి పూర్ణచంద్రుడై ।
దనరెడు క్రీస్తుచో కపట తస్కర సేవకుడయ్యు వాడు వే।
చనియట ముఖ్యయాజకుల సన్నిధిముప్పదివెండి రూకలం।
గొని ప్రభు నప్పగించుటకు ఘోరవిచారము చేసె నక్కటా ।

గీ॥ అది విని ప్రధాన యాజకుల్ ముదముతోడ।
పదియు నిరుపది యొప్పందపడిన రూక।
లిచ్చి యూదాను మెచ్చి మాయేసు పట్ట ।
నిర్ణయించిరి తగు యూదనివహములను

॥క॥ అపద్భాంధవుడట దు ।
ర్వ్యాపారుల కందరాని వాండటతానీ ।
యాపదలకొప్పి పాపుల ।
చేపట్టు వడెంగదా నిశీధినియందున్ ॥

# కీర్తన

రా–అసావేరి తా–జంపె

ఆ యంధకారంపు రేయిలో క్రీస్తు బడు నాయాసములు దలచరే । సాయంతనమున శిష్యాళితో భోజనము సేయగూర్చుండి ప్రభువు – భక్తులకనియె ॥నాయంధ॥

1. ఒకడు మీలో నన్ను యూదగణములచేతు – లకు నప్ప గించ దలచెన్ । మొక మిచ్చుకము గల్గు మూర్ఖుడగు యూ దాసు – మొనసె వీడనుచు దెలిపి । యిక మిమ్ముగూడి ద్రావకయుందునని రొట్టె – విరిచి స్తోత్రంబుజేసి ॥ ప్రకటంబుగా దీని భక్షించుడని పిదప – నొక పాత్ర నాననిచ్చెన్ ద్రాక్షారసము ॥ ఆ యంధకారంపు ॥

2. తనమేను గురుతు రొట్టెను జేసి పాపమో – చన మైనరక్త మునకు । నొనర ద్రాక్షారసంబును గురుతుగా దెలిపి – నెనరు గల కర్తయిపుడు । చనె గెత్సెమను వనస్థలిలోన శిష్యతతి – నునిచి తానొక్కరుండు ॥ మనసు వ్యాకులముచేతను గొండపై నెక్కి – ఘనుడు ప్రార్థించె దంౖడిన్ – గాఢముగాను ॥ నా యంధకారంపు ॥

3. శ్రమచేత తన శరీరమునుండి దిగ జారె - చెమట రక్తపు బొట్లుగా నమితమౌ లోక పాపము జూచి నిట్టూర్పు లప్పటప్పటికి బుచ్చీ క్రమముగా దూత తన కడకరుగు దెంచి శాం - తత బల్కి జనిన పిదపన్ ॥తమ మనంబుల బోలు తమములో యూద - సైన్యము లేగుదెంచెనపుడు గెత్సెమ వనికి ॥నా యంధకారంపు॥

4. వరశాంతి శీల సర్వజ్ఞతలు గల ప్రభువు - యెరిగి తనకున్న పాట్లు పరపంథిగణముతో బలికె మీరిచ్చోట - నరయుచున్నారెవనిని - అరులు నజరేతుడేసనువాని ననిన తా నెరిగెంచె నేనేయని ॥ గురుదీప శిఖలు సోకు పతంగముల భంగి - ధరణిపై బడిరి వారల్ - దర్పములణగి ॥ ఆ యంధ కారంపు॥

5. తన శిష్యులను విడువుడని చెప్పి రిపులచే - తను తానె పట్టువడియెన్। గినిసి పేతురు యాజకుని దాసుకర్ణంబు దునుమంగ క్రీస్తుడపుడు । కనికరంబున స్వస్థతను జేయు నావిభుని-కరములను విరిచికట్టి ॥వెనుక ముందర జుట్టుకొని యెరుసలేము పుర-మునకు దీసికొ పోయిరి-రాణువవార లాయంధ కారంపు రేయిలో క్రీస్తు బడు నాయాసముల దలచరే ॥

## ద్విపద

ఈరీతి నారాత్రి యేసుక్రీస్తుండు ।
వారలచే పట్టువడి మరిబల్కె ॥
ననుదినమేసు దేవాలయమందు ।
నొనరంగ మీతోడ నున్నానుగానె ॥
మీరు నాపై చెయి మెలపంగ లేక ।
నీ రాత్రి ననుబట్ట నేగు దెంచితిరి ॥

కత్తులు కఱ్ఱలు కరముల బూని ।
వత్తురా దొంగపై వచ్చినరీతి ॥
నమరె మీకును మరి యంధకారముకు ।
సమయమిప్పుడు గూడె శక్తిజూపుటకు ॥
ననుచున్నయెడ వార లతని గొంపోయి ।
మును ప్రధానార్చకు ముందట బెట్టి ॥
రటమీద నాదుష్టు లాయేసునాథు ।
నెటుల జేసిరొ దాని నెరిగింతు వినరె ॥
అపహసించిరి వారలందరు గూడి ।
నెపము వెట్టుచు గొట్టి నిందించు నొకడు ॥
మోవుపై నుమివేయు మూఢాత్ముడొకడు ।
తామసమతిని నిర్దయజూపు నొకడు ॥
కండ్లగంతలు గట్టు కఠినాత్ము డొకడు ।
పండ్లు గీటుచు నెత్తిపై గొట్టు నొకడు ॥
నిన్ను గొట్టినవాని నిజముగా దెలుపు ।
మున్నట్టులని హాస్య మొనరించు నొకడు ॥
బలియుడైవచ్చి చెంపలు గొట్టు నొకడు ।
కలవరింపుచు జూచి గద్దించు నొక్క ॥
డీరీతి దుష్టాత్ము లెన్నెన్ని పాట్లు ।
సారెకు బెడుచుండ శాంతుడై ప్రభువు ॥
పెనుగాలిచే కొండ బెణకని రీతి ।
ఘనబాధలకు నోర్పు గలిగి ధైర్యమున ॥
నిండు శాంతిని నిల్చు నిష్కల్మషునకు ।
వెండియు బాధ గావించి రెట్లనిన ॥

ఉ॥ ముళ్ళకీరిటమల్లి ప్రభు మార్ధమునందిడి రెల్లు కర్రరా
జిల్లగ చేతికిచ్చి నృపశేఖర నీకు ముదంబటంచు మో।
కాళ్ళను నిల్చి మ్రొక్కులిడి గర్వము బెంచి తిరస్కరించి యా।
రెల్లున గొట్టి రౌదల మరిన్ కఠినాత్మకులైన సైనికుల్।

క॥ ఇమ్మెయి గొట్టిన తరితల।
దిమ్మని సొమ్మసిల ముళ్లు దెగిరక్తము వే
జిమ్మి మొగమ్మున బారెని
కమ్మహానీయ గుణమూర్తి యాపద గనరే

అంతట

క॥ తెలతెల వారెను తూర్పున।
వలిమల కడనుండి శీతవాతము విసరెన్।
కొలకొలాడెను పక్షులు।
వెలుగులదొర తూర్పుగొండ వేడుక నెక్కెన్

## కీర్తన

రా-ఆనందభైరవి తా-త్రిపుట

వినరే క్రీస్తుని బాధా విధమూ - ముదమూ ఘనభక్తా సౌఖ్యాస్పదమూ। ఇనుడుదయ గిరినెక్కు వేళను మును ప్రధానార్చకుని యెదటికి కినుకను గొని చనిరి యూదులా గుణనిధియగు మరియనందను ॥ వినరే క్రీస్తుని బాధా॥

1. యేసునాధుని మోము వీక్షించి యాజకుడు బలికెన్। మదిలోనలుకన్। నీవు - జేసేటి యుపదేశములకున్। నమ్మనే సాక్ష్యమిడితిమర్త్యులకున్। ఏమిజేసివస్తివి నీ శిష్యులకున్। అపుడు-యేసు వానితో ననియె నేకాంతమున గాన భాసురంబుగ సభల బాహాటముగనూ ఉప ॥ దేశ మొనరించితిని నేనని

దెలుప తలవరి యొకడు దండము దీసికొట్టెను మోసమతియై దోసమించుకలేని ప్రభువును ।।వినరే క్రీస్తుని బాధా।।

2. నీవే క్రీస్తుడవానే నిజము మేమందరము వినగ। జెప్పు మనగా। యప్పుడా విభుడు పలికె మెల్లనగా । యిదే మీ భావము తెలియ వచ్చెనుగా ।। మీకునా విధము దెలుప నమ్మరుగా । ఇకనూ - దేవుని బలమైనా దివ్య సన్నిధి సుప్ర। భావుడై మర్త్యకుమారుడు వసియించు ।। కేవలంబని దెలుప వారాశీవిషంబుల భంగి దురితపు భావులై సాక్ష్యంబికేలని పపరమసాధుని జంపదలచిరి ।। వినరే క్రీస్తుని బాధా।।

క।। అపుడు ప్రధానార్చకులును
కృపమాలిన కఠిన యూద బృందంబులు పొం।
తుపిలాతుడనెడి న్యాయా।
ధిపునొద్దికి యేసుగట్టి తెచ్చిరి బలిమిన్

ఉ।। పొంతు పిలాతు దప్పురమ పుణ్యనిధానుని యేసు నాధునిం
గాంచి యకల్మషాత్ముడని కార్యములన్ బరికించు చో పగల్
బెంచిన పెద్ద లర్చకులు పెక్కగు యూదులు గొల్లు పెల్లుగా
వించిరి సిల్వపై నితని వేయుడు వేయుడటంచు మాటికిన్

క।। అనువారల కనుమతిగా
నొనర పిలాతుండు యూదయూధంబులు గో
రినయట్ల క్రీస్తునిన్ సిలు
వనువేయుట కప్పగించె వారి వశమునన్ ।।

# దరువు

రా–ఆనందభైరవి తా–త్రిపుట

అపుడర్చకాదులుప్పొంగిరి – ప్రభుని విపరీతముగ జంపసాగిరి కృపమాలినట్టి పాపపు చిత్తులై నిష్ఠ రపుసిల్వమానుపై ప్రభునివేయుటకొప్పి ॥యపుడర్చ॥

1. యెరుసలేము వూరిబైటను । సురచిరమైన కల్వరిమెట్టను॥ పరమసాదుని సిల్వపైబెట్టి తత్పాద కరమధ్యముల మేకులరుదుగ దిగగొట్టి ॥యపుడర్చ॥

2. చిమ్మె నిమ్మగు మేనిరక్తము । దాని నమ్మువారల కెంతో యుక్తము ॥ నెమ్మోము వాడి కెందమ్మిపూవలె మస్తకమ్ము వేటులను రక్తము జారి గనుపట్టె ॥నపుడర్చ॥

3. గడి దొంగలిరువుర బట్టిరి । ప్రభుని కుడి యెడమల సిల్వ బెట్టిరి॥ చెడుగు యూదులు బెట్టు కడుబాధలకు మరియ కొడుకోర్చికొని వారి యెడ దయ విడదయ్యె॥ నపుడర్చకాదు లుప్పొంగిరి ॥

# కీర్తన

రా–సారంగ తా–ఆది

పాపులయెడ క్రీస్తుని ప్రియ మెట్టిదొ పరికింపరె కల్వరి గిరిపై। ఆపదలను తనకీగతి బెట్టెడు కాపురుషుల దెస గనుగొను కృపతో ॥పాపుల॥

1. శాత్రవులదె తను జంపుచునుండగ – మైత్రిజూపె సమ్మతి తోడన్ । సోత్రము జేసెను తండ్రీ వీరల – దురితమెల్ల క్షమియింపవె యనుచును ॥పాపుల॥

2. తనపక్కను సిలువను వేసిన యొక – తస్కరుడించుక వేడుకొనన్ । కనికరంబు మనమున బెనగొనని – చ్చెను మోక్షము కడుచిత్రముతోడను॥పాపుల॥

3. యెరుషలేము కన్యలు కొందరు తన-యెదుట వచ్చి యేడ్చుచు నిలువన్-
వరుస నప్పురికి వచ్చు నాశనగతు - లెరుగ బలికి వారల నోదార్చెను ॥పాపుల॥

4. మితిలేనట్టి దురిత జీవులలో - మించియున్న పతితుల కైనన్ ।
హితముగా మోక్షంబిచ్చుటకై శో-ణిత బలియిడె వా మదికది సాక్షిగ ॥పాపుల॥

ఉ॥ ఆదివసాపరాహ్ణ సమయంబున క్రీస్తుని మేను శిల్వపై।
పాదకర క్షతంబులను బర్వెడు రక్తముచే మునుంగుచు ।
న్మోదుగ బూచినట్లు జనముల్గననొప్పగ నంతపెద్ద ని
ర్హ్రాదముతో నతండరిచి ప్రాణము వీడె మహాద్భుతంబుగన్॥

క॥ అంతట నొకదుష్ట భటుం ।
డెంతయు కోపమున వచ్చి యేసునిపక్కన్
కుంతబుంన వడిబొడిరచెను।
దొంతరలై బారరక్తతోయము లిలపై ॥ ఆసమయంబున

మహాస్రగ్ధర॥ పుడమెల్లం జూడగా నప్పుడు గడు వడకె న్భూధ్రము ల్బద్దలయ్యెన్।
యొడయుండౌ సోలమోన్ జేయుగుడి తెరయు నొండొండుగ వ్రక్కలయ్యెన్।
విడిచెన్ మర్తాండదీప్తు ల్వెస దిశలను బర్వెం తమంబున్ సమాధిన్ ।
వెడలెన్ తొల్లింటి వారల్విడిచిన తనువుల్ విక్రమాశ్చర్యరీతిన్॥

వ॥ ఇవ్విధంబున జగత్రాణుండగు యేసునాధుండు తన ప్రాణంబులు విడుచువేళ తత్సమీపంబున నున్న శతాధిపతి మొదలగువార లది గనుంగొని యితండతి నీతిపరుండనుటకు సందియంబులేదని తలంచి దేవునికి ఘనవందనంబు లాచరించుచుండి రట్టియెడ.

సీ॥ తన పాదపంకజాతముల వెంటను దంట
బాయకేగెడు ద్విరేఫంబులనగ
తన వాక్య ఘనఘనోదక కణంబులకాస
దవిలి గ్రుమ్మరెడు చాతకములనగ।
తనసాధు సద్గుణతత మానసహ్రదం
బరసిద్రిమ్మరు రాజహంసలనగ ।
తన దివ్య నామాద్భుతకథాసుదాంశు
సారము గోరు మద చకోరంబు లనగ ॥

తే॥గీ॥ దనరి క్రీస్తుని వెనువెంట ననుదినంబు ।
దగిలి భక్తిని దిరిగెడు తలిరుబోండ్లు।
మరియ ప్రభు తల్లిమరియయు ముత్తలూరి।
మరియయును నింక మిగిలిన మగువలపుడు ॥

# దరువు

రా–సారంగ తా–త్రిపుట

చేడియలు గుంపు గూడిరీ – క్రీస్తు జాడ గని తాల్మి వీడిరీ। అడికలకోర్చి నేడు మన పాలివాడు శిలువ నున్నాడుగదె యంచు ॥చేడియలు॥

1. వారి మొగములు వాడెనూ – యేసు వారివెతలెల్లజూడనూ ॥ నీరు దృక్సరసీరు హములందు జార తమ కొనగోరులను మీటి ॥చేడియలు॥

2. రొమ్ములను చేతులుంచుచూ – చింతగ్రమ్మి నిట్టూర్పులుచ్చుచూ ॥కొమ్మలట నిల్పు బొమ్మలన చేష్ట లిమ్ముచెడి యబ్బురమ్మతో నిల్చి ॥చేడియలు॥

క॥ అటులున్న వెలందులలో
కుటిలాలకయైన మరియకును దుఃఖము మి
క్కటమయ్యె నంతకంతకు।
కటకట యెట్లోర్చు కన్నకడు పెవ్వరికిన్ ॥

వ॥ అప్పుడప్పుడు బోడి తన కనురెప్ప లెత్తి సిలువదెస దప్పక వీక్షించి యప్పటప్పటి కుప్పతిల్లు శోకంబాపలేక యిట్లని విలపింపందొణంగే.

## కీర్తన

రా-మరువ తా-జంపె

ఈలాటి వెతజెందెనా - నీకు నా యేసు ప్రభు వరనందనా। తాలిమెదదూలి మరియాలతా తన్వి తన వాలుగన్నీళ్లు భువిరాల నేడ్చుచు ననియె ॥ఈలాటి॥

1. తుదమొదలు లేని దేవా - నీవు నా యుదరమున బుట్టి నావా ॥ యిదుగో నీ సిలువదెస వీక్షింప నాగుండె। చెదిరి ఝల్లుఝల్లుమని కుదురుపడ దహహనీ ॥కీలాటి॥

2. ఏదోస మెరుగనట్టీ - యన్ననీ పాదకరతలము లిట్టీ॥ సూదిమేకులచేత మోదబడె నయ్యయో। యేది యూదుల న్యాయ మెంత చెడుతనమహహ ॥ఈలాటి॥

3. తలపైని ముళ్ళవేటూ-రక్తజల మొలుకు నీ పక్కపోటూ ॥ సలుపు నీ గాయముల వలవంత నాలోన। దలపోయు తరిగుండె తల్లడిలు వహహనీ॥కీలాటి॥

మ॥కో॥ అన్న నీ పదపంజరాంతరమందు జేరిన కీరమ।
ట్లున్న నాకు భవత్సుధామధురోక్తులు న్వినరాక నీ।
చెన్ను మీరిన మోము రక్తముచే మునుంగుట జూచి నా।
కన్నగర్భమి కెట్టులోర్చును గ్రావమైన కరుంగదే ॥

వ॥ అని యక్కాంతాతిలకం బతి దుఃఖాక్రాంతయై నితాంత చింతాభరంబున నొక్కింతసేపూరకుండి దనచెంత నున్న దుఃఖస్వాంతలగు నింతులదెసం గనుంగొని యిట్లనియె.

## కీర్తన

రా-ముఖారి తా-త్రిపుట

చూడరే క్రీస్తుని జూడరే - నా సఖులారా చూడరే క్రీస్తుని చూడరే ।
చూడరే నా ముద్దులాడు నేడు ఏ దశ గూడినాడో - చూడరే క్రీస్తుని ॥చూడరే॥

1. మంటికిని నాకాశమునకును మధ్యలో వ్రేలాడుచుండగ। నంటగొట్టిన శిలువమ్రాను కప్పగించుటకొరకు నే గనుకుంటినా । యిది యెరిగుంటినా ॥ హా నా కంట నే నిటువంటి యాపదగంటి ప్రాణములుంటవే యిక ॥ చూడరే ॥

2. ఊటగా రక్తంబు దిగజారేటి బల్లెపు పక్కపోటు। మాటిమాటికి జూడ దుఃఖము మరలునే తలమీద ముళ్ళకిరీటమా యితనికి వాటమా॥ యూదులు మోటులై బాహాటమున ఈ పాటులను గాటముగ జేసిరి ॥చూడరే॥

3. మించి పొంతుపిలాతు సత్యము కించుకైన దలంప కక్కట । వంచనను గొట్టించి యూదుల మంచితనమే గోరి యప్పగించెనా। మేలు గణించెనా ॥ ఈతని గాంచి పెంచిన గర్భమెట్లు సహించునో పరికించి మీరిది ॥చూడరే॥

క॥ అని దుఃఖంబున బలికెడి ।
వనితామణి జూచి కన్గవల జలములు గొ।
బ్బున జారి బార నేడ్చుచు।
ననబోణులు పలికి రతివినయ వాక్యములన్ ॥

క॥ కొమ్మా మానుదువులుగై ॥
కొమ్మా దుఃఖాబ్ధిలోన గ్రుంకుట సరిగా।
దమ్మామది దలపోయ గ।
దమ్మా సద సద్వివేక మలకులవేణీ ॥

సీ॥ దిక్కెవ్వరునులేని దీనులరక్షింప
దిక్కైనవాడుండే దిక్కులేక।
తనకు దానె స్వతంత్రతను మెలంగెడు కర్త
పరతంత్రమున పట్టువడియ నేడు
మానసాక్షుల కందరాని దివ్యుడు
శిల్వపైని బంధింపగ బడియె నేడు
సకల జీవులకు జీవికలిచ్చు ప్రభువుదా
నొరులకై తన జీవ మొసగె నేడు

తే॥గీ॥ కటకటా లోకపాప సంకటము బాప
ఘనమహౌషమనగ నీ గర్భమునను
బొడమ ఇమ్మానుయేలు నీ కొడకటంచు
నెంచి విలపింపదగునె యోచంచలాక్షి ॥

క॥ అని పరమార్థక వాక్యము ।
లను యూరడ బల్క మరియ లలనామణి దా
ఘనమైన శాంతరసమును
గొని దుఃఖము విడిచె తత్వకోవిదమతియై ॥

# ద్విపద

వినరే యో నరులార విభుడైన క్రీస్తు ।
తన ప్రాణములు వీడు తదనంతరమున ॥
అరమత్తియ నివాసుడైన యోసేపు ।
త్వరగ నచ్చోటికి వచ్చి పిలాతు ॥
దరిజేరి యడిగి యాతని కళేబరము ।
నరుదుసిలువనుంచి యమరంగ దించి ॥
వలువతో చుట్టి గ్రావము దొల్చియున్న
బలుసమాధిని యుంచె ప్రభువు శరీర ॥
మది యెల్ల గనుగొని యాతని వెంట ।
వదలక జనినట్టి వనితా జనంబు ॥
మరలి యూరికిబోయి మరునాటియందు ।
పరిమళ తైలంబు బహు సుగంధములు ॥
మును సిద్ధమొనరించి ముదముతో సబతు ।
దినపు సేవా విధుల్ తీరిచి రంత ॥
వారంబులకు తొలి వాసరమందు ।
వారిజాక్షులు తెల్లవారెడు వేళ ॥
తాము సిద్ధము చేయు తైలగంధములు ।
ప్రేమతో గొని చనిరి సమాధి కడకు ॥
నలసమాధి ద్వారమందున్న రాయి ।
వెలికటు పొరలించి వేయంగ బడుట ॥
గని దానిలో జొచ్చి కర్తయౌ న్నేసు ।

తనువందు లేకుంట తర్కించి స్త్రీలు ॥
తమ మానసముల తత్తర మొందుచున్న ।
సమయంబునను ప్రకాశపు వస్త్రములను ॥
ధరియించినట్టి యిద్దరు దూతలచట ।
తరుణీమణులకు ప్రత్యక్షమై నిలువ ॥
భయముతో జూడ నోపక యున్నవారి ।
దయతోడ జూచి దూతలు యిట్లులనిరి ॥

## కీర్తన

రా-సారంగ తా-త్రిపుట

సుదతులారమీరిచ్చోట నెవ్వారి వెదకుచునున్నారు । మృదువుగాను జీవించువాని పెద్ద నిదురబోయినరీతి నెదలందు భావించి ॥ సుదతు॥

1. ఇచటలేడు లేచి-యున్నాడు ప్రభు క్రీస్తు-యేసు స్వతంత్రుడై । ప్రచురంబుగ తన పాట్లు లేచుటయును వచియించె గలలెయ్య వరదేశమున మీతో ॥సుదతు॥

2. మనుజ కుమారుడె - క్కుడు పాపిష్టుల చేత - మరణమొందుట శిల్వపై। దనకు దానె మూడో - దినమందు లేచునంచును దెల్పెగద మీరు - వవినుచుండగా తొల్లి ॥సుదతు॥

3. ఎదలోన జ్ఞాపకము చేసికొనుండింక - యేసు దెల్పిన మాటలూ । ముదముతోడ జీ-వమున లేచెననువార్త-మదవతులాలించి రది నిక్కముగదోచ ॥సుదతు॥

సీ॥ దూతలారీతి చేతో ముదంబున బల్కు
పలుకుల దలచి యాతలిరుబోండ్లు
బిరబిరబోయి దెల్పిరి శిష్యులకునింక
పెరవారికచ్చోట జరుగువార్త।
లవి విని పేదురుండ సాహసమునవే చని
సమాధ్యంతరంబునను జొచ్చి
వెదకుచో వస్త్రముల్ వీక్షించి తనలోన
చింతించి యాశ్చర్య చిత్తుడగుచు ॥

తే॥గీ॥ మరలి చనియెను తరువాత మగ్దలూరి
మరియ కగుపడి క్రీస్తుండు మాటలాడె
పిదప శిష్యులు యూదుల భీతివలన
నొక్కచోనున్న దర్శనంబొసగె ప్రభువు॥

క॥ పదకొండుమార్లు క్రీస్తుడు
సదయుండై దర్శనం బొసగె శిష్యులకున్
ముదమున పెరవారలకును
పదిముప్పది దినములవని పై జరియించెన్ ॥

వ॥ మరియు నప్పరమాది కారియగు యేసునాథుండు సమాధినుండి లేచి నలుబది దినంబులిట్లు పృథివియందుండి తుద దినంబునందన శిష్యులతో నొక్క గిరివరంబు పైకింజని వారల విట్లని యోదార్పదొణంగె.

## కీర్తన

రా–ముఖారి తా–ఆది

ఇదిగో నా శిష్యులారా యెరుకలుంచండీ – మోక్ష
సదనమున కేనుబోదు సంతోషించండీ ॥ఇదిగో॥

1. యెరుసలేమందుండి మీ రెదురు చూడండీ - మీపై
పరిశుద్ధాత్మయు దిగి వచ్చీ పనులు దెల్పునూ ॥ఇదిగో॥
2. దిక్కులేనట్లు మిమ్ము దిగనాడి పోనూ మీతో
మక్కువగనుండ బరిశుద్ధాత్మను బంపించెదనూ ॥ఇదిగో॥
3. నిర్వాణమున మీకొరకై నెలవులు గల్పింతూ - నాతో
సార్వకాలము నిత్య సామ్రాజ్యము నేలా ॥ఇదిగో॥
4. ఒకనితో నొకడు ప్రియము లొప్పయుండండీ - నాదు
సకలాజ్ఞలందు నిదియే సారమనుకొండీ ॥ఇదిగో॥
5. ఏదైనన్ నా పేరటను వేడుకొంటేనూ - మీకు
మోదముతోడ దాని ముందే చేయుదునూ ॥ఇదిగో॥
6. ఉల్లములందు కలతలెల్ల విడువండీ - నేను
మరల వచ్చెడి విధము మరువకుండండీ ॥ఇదిగో॥
7. విశ్వాసముంచండి సర్వేశ్వరునియందూ - మీకు
శాశ్వతమైన మోక్షస్థలి సౌఖ్యము లబ్బా ॥ఇదిగో॥

మరియును

క॥ పరభూలోకంబుల నా।
కిరవుగ సర్వాధికార మివ్వంబడెనో ।
వరభక్తులార యిక మీ ।
రరు గంగావలయు జగతి యంతట దిరుగన్ ॥

## కీర్తన

రా-కళ్యాణి తి-త్రిపుట

సువిశేష మధురవచనమూ - నా సఖులారా భువిలో చాటుడీ యనుదినము । అవిరతమును జగదంత్యము వరకుమీతోనే । తవిలి యుండెదను

సంతసముగ మీరేగీ। సవినయ ప్రియబోధచే నిశ్చయముగా మద్వాక్యములు మా-నవుల కెల్లను దెలిపి వారి వినమ్రులగు శిష్యుల నొనర్చుడీ ॥సువిశేష॥

1. వరునతో నటమీాదను। పితృపుత్ర-పరిశుద్ధాత్మల పేరనూ పరమానందముతోడ బాప్తిస్మస్నానము। గురుతుగా మీరలొసగుడీ యంచు మరితెల్పి ॥ నెరవుగా నా యాజ్ఞలన్నియు నిక్కముగ మది - నమ్ము వారలు - పరమపదమున నిత్యరక్షణ వరసుఖంబులు బొందబడుదురు ॥సువిశేష॥

2. మదిలోన నను నమ్మని। దుర్జనులకు - తుది ఘోర నరకాగ్నిని॥ విదితంబుగా దీర్చి వేయంగ బడునంచు। నిదిగో రమ్మని చేతులెత్తి శిష్యులపైని॥ ముదముగా నాశీర్వదించిన పిదప మింటికి యెత్తబడి తన - యెదటివారి కదృశ్యుడై ప్రభు వేసు కైవల్యమున కేగెను ॥సువిశేష॥

క॥ ఈ పగిదిని ప్రభునేగిన।
యాపిదపను శిష్యులెచటి కరిగిరో మరియ।
య్యాపొస్తు లొనర్చెడు స।
వ్యాపారమ దెల్పెదను ముదంబున వినరే

సీ॥ అపుడు శిష్యులు మిక్కిలాశ్చర్యమున
నభంబునకేగు ప్రభుతట్టు మొగము లెత్తి
జూచుచు నుండంగ శుభ్రాంబరములు
గట్టినవార లిద్దరిట్లనుచు బలికి
రో గలిలేయులార యీగతి మీరేల
వింగిపైచూడ్కులు నిలిపినిలిచి
యుండంగ నేటికత్యున్నతంబగు
మోక్షమునకేగె క్రీస్తుండు ఘనతతోడ

తే॥గీ॥ నిపుడతండు పరమునకు బోవు టెట్లుజూచి।
నారొయారీతి నిక నొక్కసారి యతని।
రాక గలదంచు దెలుప పర్వతము డిగ్గి।
యెరుసలేముకు బోయి రందరు ముదమున॥

మ॥కో॥ ఆ పురంబునజేరి పేతురు డాదిగా గల శిష్యులున్
ప్రాపుగా తమ వెంటనంటిన పంకజాక్షులు కొందరున్।
కాపు కర్తయు బంపు నాత్మను గాంచుదాకను నొక్క సౌ॥
ధోపరి స్థలమందు గూడి కోయుండిరొక్క మనంబుతోన్॥

వ॥ ఇట్లేకాంత మందిరంబున నందరుంగూడి నూట యిరువది జనంబులు లెక్కకు తక్కువగాకుండి నితాంత ప్రార్ధనాపరతంత్రులై యున్న యెడ సకల భక్త జనానుమోదుండగు పేతురుండిట్లనియె.

ఉ॥ సోదరులార క్రీస్తు పరిశుద్ధ జనావళిలోన దుస్వభా
వోదయుడై యొకండు ప్రభునొప్పనివారల కప్పగించి పా।
పాదరుడై తనంతనె దురాపద బొంది నశించె నింక నీ
ద్వాదశ భాగమందు తగువాని సమర్పణ సేయగా నగున్ ॥

మ॥ అని వారందరిలోన ప్రేషిత ఘన వ్యాపారమున్ సేయజా
లినవా రిద్దరినెంచి నిల్పి మది తెల్విన్ పేతురుండిట్లు ప్రా
ర్థనచేసెన్ సకలాంతరాత్మలను సందర్శించు మాదేవుడా
గనినీ వీయెడ నిందులో నొకని నీ కార్యార్థమై జూపవే

॥గీ॥ అనుచు మత్తేయి యోసేపుల నెడివారి
నిలిపి ప్రార్థించు తరిదైవ నిర్ణయముగ।
పాలు మత్తెయునకు గల్గె పదనకొండు।
మందితో ప్రేషితుం డనంబరగె నతడు

# దరువు

రా–ఆనందభైరవి తా–త్రిపుట

వినరే యాపోస్తల కార్యముల్ – క్రైస్తవులను వారి కవి యెంతో ధైర్యముల్ । మనసు లొక్కటి చేసుకొని యట్లు ప్రార్థించ ఘనముగ విమలాత్మ జనుదెంచె వారిపై ॥వినరే॥

1. పరమండలమునుంచి వచ్చెనూ – పెద్ద చౌరుగాలివలె శబ్దమిచ్చెనూ ॥ తిరముగ వారలందరు గూడియున్న మందిర మెల్ల నిండె బంధురమై తన్నాదము ॥వినరే॥

2. అనలార్చిలకువలె దీప్తి మించుచూ – బీటలగు జిహ్వాల వలె గన్పించుచూ ॥ఘనముగ నొక్కొక్క జనునిపై నవి నిల్వగను పరిశుద్ధాత్మచేతను నింపబడిరంత ॥వినరే॥

3. వారన్యభాషలతోడనూ – యాత్మ ప్రేరేపణముసేయు జాడనూ ॥ ధారాళముగ భాషాంతరము లాడిరి విన్న వారికబ్బురమై విచారముల్ బొడమంగ ॥వినరే యపోస్తులుల॥

# ద్విపద

ఈవిధంబున వార లితర భాషలను ।
దైవాత్మచే బల్కు తత్కాలముననుు ॥
గుంపులై యట గూడుకొను పురజనుల ।
నింపుగ గని పేతు రిట్లనిపలికె ॥
యెరుసలేమున వసియించి యున్నట్టి ।
వరయూదులారా మద్వాక్యముల్ వినుడి ॥
పగటిలో నొకజాము బరగినదిపుడు ।

యొగి మీరలనుకొని యున్నట్లుగాదు॥
మత్తు బొందుటలేదు మా వారిలోన ।
సత్తుగా విమలాత్మ సాక్షిగైకొనిరి ॥
యోవేలు దీర్ఘదర్శ్యుక్తులు నేడు ।
బాయక నెరవేరె ప్రకటంబుగాను ॥
నజరేతుడగు యేసు నాథునిచేత ।
నిజముగా దేవుడు నిఖిలాద్భుతములు ॥
మీలోన జేయించె మీరవి యెరిగి ।
మేలొనరుచు వాని మెచ్చుకోలేక ।
మన భవిష్యద్ జ్ఞాన కారణమునను ।
తను నప్పగించె నిర్దయను మీ రతని ॥
పట్టిపాపిష్ఠులై పటువైన సిలువ।
బెట్టి చంపితిరి బల్మిని యేసునాథు॥
దేవుడాతని లేపె దివ్యబలమున ।
దావీదు మునుదెల్పు తత్ప్రోక్తులట్ల ॥
ప్రభు పునరుత్థాన భావర్థకలిత ।
శుభవాక్యమను వ్రాత చూడరే మీరు ॥
దావీదు బల్కు చందమున క్రీస్తునకు ।
దేవుడు లేపంగ దీసె దీనికిని॥
మేమందరము సాక్షి మరి గంటి మిదిగో ।
ఘన విమలాత్మ వాగ్దత్తంబు నిపుడు ॥
బడిసితి మతడె మాపయి కుమ్మరించె ।
యెడపక మేమింక ఇశ్రేలులోన ॥

ప్రకటించెదము వాని భద్రోక్తులనిన ।
సకలంబు విని వారి స్వాంతంబులందు ॥
గుచ్చుకొన్నట్టైన గొందరు యూదు।
లిచ్చతోడను బల్కి రింపుగానపుడు ॥

సీ॥ అపోస్తలైన మా యన్నలారా యింకనేమి
సేయుదుము మీరిపుడు మాకు ।
దెలుపరే యని హృద్విదీర్ణులై తమువేడ
పేతురుండనియె సంప్రీతితోడ
సరగమీరెల్ల పశ్చాత్తాపమును బొంది
దురిత క్షమాపణకొరకు క్రీస్తు
నామంబుచేత స్నానము చేసి విమలాత్మ
పొందుడంచు ననేక బోధ దెలుప

తే॥గీ॥ నప్పుడాదినమున పాపమొప్పు కొంచు
మూడువేల జనంబులు ముదముతోడ
స్నానమొందిరి పరిశుద్ధ సంఘమపుడు।
ప్రబలమయ్యెను దైవాత్మబలము వలన ॥

క॥ అది మొదలుగ ప్రభు సంఘము
కుదురుగ కొనసాగె దిటము గొని యాపోస్తుల్
బెదరక నప్పురమంతట
చెదిరి ప్రసంగించిరి సువిశేషము వరుసన్॥

# కీర్తన

రా–ఎదుకులకాంభోజి తా–ఆది

వినరయ్యా యాపోస్తుల నాటీ వృత్తాంతము పొంతదీని ననుసరించ నట్టి కథలెల్లను తంతులసంతా ॥వినరయ్యా॥

1. ప్రేమలంతంతకు సభలోన పెచ్చు పెరిగెనూ – తమ తమ భూములాస్తులమ్మి మోదంబున పంచుకోదినిరీ ॥వినరయ్యా॥

2. యేసునామ మెరుసలేము వీధులలోనా – వారలు జేసిరి ప్రకాశము విశ్వాసముగ బహుళాద్భుతములతో ॥వినరయ్యా॥

3. పుట్టు సొట్టవాని పరుగు వెట్టజేసిరీ – వారలు ముట్టుకొను మాత్రమున రోగంబుల బాసిరి జనులు ॥వినరయ్యా॥

4. దబ్బర మాటలాడబోయీ దంపతు లిరువురూ – వారల నిబ్బరంబగు వాక్య మెదుట నిమిషములోనే మరణంబయిరి ॥వినరయ్యా ॥

5. మరణమైన వేరొక స్త్రీని మరియొక పురుషుని – వారలు మరలి జీవస్థులుగా జేసిరి పరిశుద్ధాత్మని వరబలములతో ॥వినరయ్యా ॥

6. వరుస ప్రధనార్చకాది వర్గంబులచేత–వారలు విరిచికట్లు కొట్లు నానావిధమైన బహుపాట్లు పడిరి ॥వినరయ్యా॥

7. దూతలొక్కొకవేళను వారికి తోడు వచ్చిరీ – శత్రుచేతినుంచి విడిపించుటకు భీతి మాన్పి దిటమిచ్చుటకు ॥వినరయ్యా॥

8. ప్రభు నామముకై కొంధరు చాలా పాట్ల హతులైరీ – కొందరు శుభమగువార్త నన్యదేశస్థులలో ప్రకటించుటకు చనిరి ॥వినరయ్యా॥

9. పౌలనే యింకొక ప్రేషితుడు ప్రభు నామము కొరకు – చెప్పగా జాలనట్టి శ్రమలను బొంది సంఘంబులు మిక్కిలి సమకూర్చును ॥వినరయ్యా॥

10. మత్తే యాదులు మరియు ప్రేషితోత్తమ కార్యములు - యింక నుత్తరములు ప్రత్యక్షముతో నొప్పు సువిశేషం బిదె చదువుచు ॥వినరయ్యా॥

11. పాపాత్ముల రక్షించను బిల్చె ప్రభుని వాక్యమూ - ఎంతో తీపెగా వీనులను జొచ్చె దీన చిత్తులగు వారందరు ॥వినరయ్యా॥

మ॥ ఇటులాపోస్తల నాటినుంచి స్థిరమై యీ కాల పర్యంతమం ।
తటి దేశంబులలోన బోధకులు తద్వాక్యంబు ఘోషింప మి
క్కటమైనట్టి ప్రయాసలంబడి తిరస్కారంబులం బొంది చా।
వుటకున్ ప్రాణములొప్ప క్రీస్తు మతమున్ బోధించుచున్నారొగిన్

గీ॥ ఇంక లో కాంతమగు దాక నిటుల జరుగు।
క్రీస్తునామంబు భువిలో సమస్తమైన ।
ప్రజల వీనులకును వినంబడిన పిదప ।
నంత్యదివసంబు వచ్చు నత్యద్భుతముగ ॥

క॥ ఆ దినము రాక మునుపే ।
మోదముతో దీని జదివి బుధజనులారా
వాదు లికమాని క్రీస్తుని
పాదంబుల శరణుజొచ్చి పాపము విడరే ॥

క॥ త్రాణోపాయం బిది వి
న్నాణంబుగ జదివి మదిని నమ్మె జనులకున్
ప్రాణ ప్రయాణమున ని
ర్వాణానంద సుఖ నిత్య రాజ్యము గలుగున్ ॥

# మరియు అంత్యన్యాయపు తీర్పునుగురించిన మూడవ ప్రకరణం బెట్టిదనిన

క॥ వరసాధు సుజనక్రైస్తవ ।
పరిమోదానంత దివ్యభవ్య తరంబై ।
దురితాత్ముల కమిత భయం
కరమౌ న్యాయం తీర్పుకాలము వచ్చున్

అట్టికాలంబునంది

సీ॥ ప్రళయాగ్ని గంధక ప్రబధూమ సమూహ
మాకాశమండలం బావరించు
నిందుమర్తాండుండు నిజదీప్తులను బాసి
కంబళ సదృశమై గానుపించు
హిమకరుండు కళావిహీనుడై రక్తవర్ణము
నొందు నక్షత్ర సముదయంబు
లంజూర భూరుహంబందునుండి యకాల
ఫలములు పెనుగాలివలన దూలి॥

తే॥గీ॥ రాలు గతి గతిదప్పి బిరాలనేల ।
పాలుగా దెగి జిగివీడి రాలిపోవు
గగనమండలి చుట్టిన । గ్రంథమట్ట
ఘోరరవమున మెటయేని పారిపోవు ॥

గీ॥ అపుడు సర్వం సహాచక్ర మఖిల పర్వ
తాదులును వస్తువితతి దైవాజ్ఞవలన

లయభయానక వహ్ని కీలావళులను
కాలి యల లోహమును బోలి కరిగిపోవు

॥తత్సమయంబున॥

## కీర్తన

రా–గౌళీపంతు తా–ఆది

అదుగో క్రీస్తుడు మేఘారూఢుండై వేంచేసెను మింటను । తుది దినమున పదిపది వేలధికము దూతలు రావెను వెంటను ॥అదుగో॥

1. ఇరు తెగువలుగల ఖడ్గము ముఖ గహ్వరమున వాడిగ వెల్గనూ। ఖరకరు వేడిమి కన్నను దన ముఖకాంతులు నంతట బర్వనూ ॥అదుగో॥

2. పటుతరమగు వహ్ని జ్వాలలవలె ప్రభుని కనుంగవ యొప్పనూ । దిటముగ కుడి హస్తంబున నార్నొక్కటి నక్షత్రములుండనూ ॥అదుగో॥

3. తళతళమగు తెల్లని శీతమువలె దన తలవెంద్రుక లొప్పను। యెలమితోడ కొలిమిని కర్గించిన యిత్తడివలె కాళ్లుండనూ ॥అదుగో॥

4. చూపులకును మిరుమిట్లగు వస్త్రము సుపదంబులవరకుండనూ। పాపుల గుండెలు పగిలెడునట్లుగ బాకానాదము నిండనూ ॥అదుగో॥

క॥ అంతట దూతలు లోకా ।
భ్యంతరముగ జేయునట్టి బాకాధ్వని రో ।
ధోంతరము నిండుకొను న।
త్యంతంబుగనంతలో మహాద్భుతలీలన్ ॥

గీ॥ ఆదినుంచి లోకమందు జననమొంది ।
మరణమైన సకల మనుజ కోట్లు ।
తత్క్షణము లేతు రక్షయకాయులై
పరమరాజు దివ్య బలమువలన ॥

సీ॥ ఇదె పునరుత్థానమిదె మారు జననంబు
క్షయ మక్షయము దాల్చు సమయ మిదియె
సకల మర్త్యుల మానసములు శోధించి
తత్కర్మార్జితము లిచ్చు గాలమిదియె
పరిశుద్ధ లోకవంక పాపాత్మ లోకవంక
తిరముగా నిలిచెడిదివస మిదియె
నిరయదుఃఖంబైన నిర్వాణసుఖమైన
శాశ్వతంబుగ బొందు సమయ మిదియె ॥

ఆ॥వె॥ సిద్ధమైవచ్చె నేడంచు జెప్పుకొంచు ।
తొల్లి క్రీస్తుని సుఖబోధ ద్రోయునట్టి ।
పాపులెల్లను న్యాయాధిపతిగ వచ్చు।
యేసు దెసజూచి భావింతు రివ్విధమున ॥

## కీర్తన

రా–ముఖారి తా–ఆది

నాడు వచ్చినట్లు గాదు నేడు రాకట – తేరి చూడరాదు క్రీస్తునింక జొత్తు మెచ్చట ॥

1. మృదువు గొఱ్ఱెపిల్లారీతి మొదటనచ్చెగా – ఇపుడు కొదమసింహమయ్యె మనకు గుండె దిగులుగ ॥నాడు వచ్చి॥

2. దాసునివలెను చూచినాముగా వాసిగాతొల్లి – యిపుడు దోసము లెంచి దండింప మనకు దొరయైనాడుగా ॥నాడు వచ్చి॥

3. ఏ తట్టుబోయినా మనకెదురై వచ్చెగా – పిడుగు రీతి వాని యుగ్రమైన దృష్టి హెచ్చుగా ॥నాడు వచ్చి॥

4. కొండవండలందు డాగియుండలేముగా - వాని యండ నుండి మండే యగ్ని యదిగో వచ్చెగా ॥నాడు వచ్చి॥

5. దిక్కుగా నున్నట్టు లితర దేవుండ్లను నమ్మి వట్టి పుక్కిటిపురాణములకు బోయిచెడితీమి ॥నాడు వచ్చి॥

6. వీధుల బోధించువాని వినక పోతిమీ - యిపుడు బాధబొంది నరకాగ్నిలో పడ బాలైతిమీ ॥నాడు వచ్చి॥

క॥ అని పాపులిట్లు తమలో ।
నను తామె వచించుతరి మనస్సాక్షియు వే ।
దనపరచుచుండు నయయో।
వినరే వరులార మది వివేకము తోడన్ ॥

## కీర్తన

రా-అసావేరి తా-త్రిపుట

ఇప్పటి నరులారా యిక వచ్చు లయబాధ తప్పించుకొన మీరు త్వరపడరయ్యా । మెప్పు బొందిన యట్టి గొప్ప వార్మైరెన తప్పు లేనటువంటి దారిలోనున్నారే - ॥ఇప్పటి ॥

1. పండితులైనాను బలశాలులైనా భూ । మండలాధిపులైన మాన్యులైన్మైరెనా ॥ఖండితమగు తీర్పు కాలంబులోబడ్డ నిండు నెమ్మది లేని నేర్పులు వృథగాక ॥ఇప్పటి॥

2. ధనవంతులైనాను తగువారలైనాను । గుణవంతులైనా బల్కులజుల్మైరెనా ॥ఎనలేని తుది దినమునకు లోబడువేళ । మనసు నెమ్మది లేని మహిమలు వృథగాక ॥ఇప్పటి॥

3. ఉపవాస పరులైనా జపమాల ధరులైనా । దపసులైనను ఎంతో

నిపుణుల్మీరైనా ॥నుపమ లేనట్టి న్యాయపు వేళ మీ మదికి। విపుల శాంతములేని విధుంలన్ని వృధ గాక ॥ఇప్పటి॥

4. సకలంబు విడిచీ సంశయ మెల్ల దుడిచీ ।నమ్మికతో క్రీస్తుని గొల్చు మృదుభక్తులైతే ॥ నకలంక మగుహృదయానందములనుందు । రొకబాధ మది నంటకుండు నంతము నందు ॥ఇప్పటి నరులారా ॥

గీ॥ వినుడి జనులార కడనాటి వివరమెల్ల ।
న్యాయపీఠంబుపై యేసునాధుడట్లు ।
మహిమ మీరంగ గూర్చుండి మంచివారి ।
చెడ్డవారిని ఏర్పాటు సేయదలిచి ॥

క॥ దూతల కానతి యిచ్చిన ।
యీ తట్టాతట్టునుంచి యించు లోనన్ ।
పాతకులను మోక్షపురీ ।
జాతకులను ప్రభువు మ్రోల సమకూర్తురొగిన్ ॥

క॥ ఆతరి క్రీస్తుని రక్తము ।
చేతనుమును కడుగబడిన శ్రీ జనములు దు।
ర్ణీతుల దెసగని తొల్లిటి ।
హేతువు లెత్తుచును వారికిట్లనిరి వెసన్ ॥

## కీర్తన

రా–ముఖారి తా–త్రిపుట

అదుగో నాడు ఇలకు వచ్చినతడె యితడో యన్న లారా। యిదిగో నేడు దివినుంచి యా యేసువె వేంచేసె చూడుం ॥అదుగో నాడు॥

1. తొల్లి దారిద్రుండై పసుల తొట్టిలో పుట్టినాడంచూ। నుల్లసంబు లాడితిరే సర్వోన్నతుడై వచ్చె నేడు ॥ అదుగో ॥

2. మరియ కొడుకు వీడేకాడా మనబోటివాడనుకొంటిరీ । పరమేశ్వరు నాత్మజు డితడని మీ రెరుగ దొరగా వచ్చె నేడు ॥అదుగో॥

3. యేసు నజరేతుడనీ హీనమగు పేర్పొందేమున్ను।వాసిగా రారాజై నేడు వచ్చి గద్దెపైనున్నాడు ॥అదుగో॥

4. నాడు గార్ధభముపై నెక్కినాడనుచు వెల్తిగ జూచితిరి। నేడు మేఘారుఢుండై వర్ణింప దగినవాడైవచ్చె ॥నదుగో॥

5. చేపలను బట్టే జాలరులు శిష్యులింతేగా యంటిరీ । యేపుమీర కోట్లు దూత లేగుదెంచ వచ్చెనేడు ॥అదుగో॥

6. పాపాత్ములు సుంకరులౌ వారి పంక్తిలో దిన్నాడంటిరీ ఆ పరేశు కుడిపార్శ్వమునం దమలుడై యున్నాడు నేడు ॥అదుగో॥

7. దయ్యములచే తొల్లి యద్భుతములు చేసినాడంటిరి యియ్యెడను శాశ్వత కాయంబు లిచ్చి మిమ్ముల లేపినాడు ॥అదుగో॥

8. దీనుడై మృదూక్తులను దివ్యబోధ జేసెను మున్ను సానబట్టు కత్తివలెను సబలుడై మాట్లాడు నేడు ॥అదుగో॥

9. జీవాధారమైనా బోధ చెవిని బెట్టకుంటి రపుడు ।చావరాని చావు గలిగే శాపము వినియెదరు నేడు ॥అదుగో॥

10. తల చాపుటకు స్థలములేని దరిద్రుడని వీడితిరీ । నిలుడైనవారికి ముక్తి నెళవు లియ్యవచ్చె నేడు ॥అదుగో॥

11. వెలితిగాను జూచి తొల్లి వెళ్ల దరిమినారు మీరు । ఫలములెంచి యియ్య మీకు ప్రభువుగా వేంచెసె నేడు ॥అదుగో॥

12. ముళ్లనల్లు కిరీటము మూర్ధమందుంచితిరి తొల్లి! యెల్ల లోకస్థుల

కేలికగా నిప్పుడభిషిక్తుండై వచ్చె ॥నదుగో॥

13. దీనతను ప్రధానార్చకుని దేవిడిలో నిలిచెను తొల్లి । భానుతేజుడై న్యాయాధిపతిగా వచ్చినాడు నేడు ॥అదుగో॥

14. పొంతు పిలాతునికి యెప్పగించబడినాడు తొల్లి । మంచి చెడ్డవారి నిపుడు మన్నించ దండింప వచ్చె ॥ నదుగో॥

5. సిలువపై నెక్కించి మున్ను చిన్నతనముగ జూచితిరి। కళలు ప్పొంగుచుండె ముక్తిగద్దెనెక్కినాడు నేడు ॥అదుగో॥

16. శిరములూచి యపహాస్యములు చేసినారు మీరు తొల్లి । స్థిరముగ తలఎత్తి నిల్చి తేరిచూడ జాలరిపుడు ॥అదుగో॥

17. దొంగవాడై నట్టిద్దరు దొంగల మధ్యను నేసితిరి । దొంగ యో స్వతంత్రుడో మీ దొరయో యిది జూచెదరు నేడు ॥అదుగో॥

18. మృతి బొందు వారిలో నొకని గతిగ నెంచితిరి తొల్లి ప్రతిఫలమిచ్చే మీ ప్రభువై ప్రత్యక్షుడైనాడు నేడు ॥అదుగో॥

వ॥ మరియు నట్టియెడ గొందరు దూతలు పాతక జన వ్రాతంబులం జూచుచో నిట్లని చెప్పందొణంగుదు రది యెట్లంటేని

## కీర్తన

రా–గౌళీపంతు తా–అట

పాపులార మీ పని సరిగద ప్రభు కోప దినము వచ్చెన్ మీ పౌరుషములు మిట్టిపడుటలును యీ పట్లను గన నేమగు నయయో ॥పాపులార॥

1. చిటచిట నినదోత్కట నారక శిఖ శిఖ లంగము గప్పున్ । పటపట రవముల పంళ్ళు గొరుకు సంకట వేదనలొదువు ॥కటకట యనియెడు పటుశోకధ్వని కలకాలము గలుగున్ । ఎటు జూచిన విటతటంబుగా నంతటన్

పిశాచప్రదళంబు లార్చును ॥పాపులార॥

2. పొరిబొరి దుష్కృతములు సాక్షిగ ముందర వరుసనునిలుచున్ తెరతెరలై భీకరాగ్ని పురుగులు తెగదిను నంగములు చురచుర గాల్చుచు చుట్టిముట్టి విస్ఫులింగములు గురియున్ । పరిపరి విధ దుర్బాధల మూల్గగ కరుణ జూప నెవ్వరు లేరయయో ॥పాపులార॥

3. భగభగ మనియెడు మంటలు తనువులపై పరుగులు వెట్టున్ । నిగనిగ లాడెడు నిప్పులకుప్పుల పొగలెగయుచు గప్పున్ । ధగధగ మనును దనగ్ని రవులుచు దరికొని జుట్టు కొను । అగాధమగు నరకాగ్ని కుండమున యుగయుగములు వడి యుండెద రయయో ॥పాపులార॥

గీ॥ అపుడు రారాజు మొగమొప్పు నద్భుతముగ
సజ్జనులపట్టు పూర్ణేందు సదృశమగుచు
సకల దుర్జనులకు భయానకము జూపు
ఖరకిరణ మండలముపోల్కె కానబడుచు.

## ద్విపద

ఆ రీతి యువరాజు ఇలలోని నరల ।
నారి న్యాయము దీర్చ వచ్చిన వేళ ॥
సకలాంత రాత్మల సాక్షి తానగుచు ॥
నకలంకుడా ప్రభు నంతయు నెరిగి ॥
యొక గొల్లబోయని కుపమానముగను ।
ప్రకటంబుగా దీర్చు బద్ధతి వినరే ॥
మేకల మందలో మెలగెడి గొర్రె ।

లేకత్వమున నుంచ కెడజేసి మరియు ॥
గుడిపార్శ్వమున నుంచి గొఱ్ఱెల కదుపు ॥
నెడమ పక్కను మేక లెల్లను నిలుపు ॥
కరణి పుణ్యాత్ముల కల్మషాత్ములను ।
ఇరు పార్శ్వముల నిల్పి యేసు నాథుండు ॥
అపుడు దక్షిణ పార్శ్వ మందున్న వారి ।
కృపకు పాత్రుల జేసి యిట్లని పలుకు ॥
నా తండ్రిచే దీవనలు బొందబడిన ।
నీతి చేతనులార నిజభక్తులారా ॥
పరమేశ్వరుండు మీ ప్రభువాదినుంచి ।
కరుణతో సిద్ధంబు గావించియున్న ॥
నిత్యమౌ రాజ్యంబు నెరిని గైకొనను ।
అత్యంత సంతోష మమర రండనుచు ।
శాశ్వతానంద మోక్ష సుఖంబు లిచ్చి ।
విశ్వాసులను గారవించి యా వెనుక ॥
యెడమతట్టున్న పాపేచ్ఛులనెల్ల ।
కడుభీతి గొన వారి గని యిట్లు బలుకు ॥

శా॥ శాపగ్రస్త సమస్త దుర్జన మనుష్య శ్రేణులారా వినుం।
డా పైశాచక దూత వర్గముల కాయత్తంబుగా జేయసం।
తాపానంత నితాంతనిత్య దురవస్థా ప్రాప్త దీప్తా కిన్ ।
పోపొండంచును జెప్పి దుర్గతికి బంపున్ క్రీస్తుండత్యంబునన్

॥అట్టి సమయంబున॥

# కీర్తన

రా-పంతువరాళి తా-ఆట

అయ్యో యిది యెంత దుఃఖము - ప్రభు తీర్పు వేళనయ్యో యిది యెంత దుఃఖము ।సయ్యన యెహెూవా సింహాసనముచుట్టూ వహ్నిమండు । నయ్యెడ విశ్వాసులకు దురాత్ములకగు నిత్యభేద ॥మయ్యో॥

1. తల్లిపిల్లలు గూడుదు రచట - తండ్రి తాతలచ్చట కలుతు । రెల్ల కాల మటులనుండ కెడబడి మరియెపుడు కూడ ॥రయ్యో యిది॥

2. అన్న దమ్ములచ్చట కూడుదు - రక్క చెలియలందు కలుతు । రెన్నడు మరి చూడరాని యెడగల స్థలమునకు బోదు ॥రయ్యో యిది॥

3. భార్యభర్తలు కూడుదు రచట - బంధుమిత్రులు కలుతు రందు । కార్య భేదమువలనసర్వకాలము మరికూడజాల ॥రయ్యో యిది॥

4. క్రీస్తు మతపు బోధకులు - సమస్త శిష్యులు కూడుదురచట । వాస్తవస్థితు లెరుగబడినవల్లనె విడబడుదు రెంద ॥ రయ్యోయది॥

5. శిష్టులు దుష్టులు నిల్తురచట -స్నేహవంతు లంద కలుతు ।రిష్టముగాని భిన్నములగుచు నిక యెన్నటికి గూడ ॥రయ్యోయాది॥

౬. అలపిశాచి పాపులందరు -నపుడు కర్తకు భిన్నులగుచు పలుగొరుకుల నిత్య నరక బాధల పాల్పడగ బోదు ॥రయ్యోయిది॥

7. సాధుసజ్జ నాత్మ లెల్ల -సకల దూతలతోడ గూడి । మోదముతో ప్రభుని వెంట ముక్తికేంగి నిత్యులగుదు ॥ రాహా యిది యెంత విజయము । ప్రభు తీర్పున్ వేళ నాహా యిది యెంత విజయము ॥

సీ॥ అపుడు ధైర్య వీహీను లఖిల మిథ్యా వాదులగు
వారి గుండెలు దిగులు పడగ ।

నపుడు మాయావుల కఖిల దురాత్మలకు
వెక్కసపు భయానకము దోప ।
నపుడ విశ్వాసుల కఖిల దుర్వ్యభిచారకులకు
మానసము లాకులత నొంద
నపుడు నరాంతకులగు వారలను విగ్రహారాధ
కులను దుఃఖాళి ముంప

తే॥గీ॥ ॥భూరి ఘోరాంధకార దుర్వారనార ।
కాగ్ని గంధక సహితమై యారకుండ ।
మందు గుండంబులోబడి మగుడలేవ ।
రకట రెండవ మృతికి పాలైనవారు ॥

క॥ మరియు పిశాచము మృత్యువు ।
దురితాత్ముల తోడ గూడ ద్రోయించబడున్ ।
నరకాగ్ని మడుగు మధ్యను ।
చిరకాలమువరకు బాధచే బడియుండన్॥

వ॥ ఇట్లు పాపాత్ములు సకల శాపాత్ములతో గూడి యొక్కింత దీపకాంతియైనం జూపరాని నిరయ కూపం బునం ద్రోయంబడి యుండుదరు. మరియు క్రైస్తవ సాధుభక్త బృందంబు లానందబునం దమ రక్షకునితో మోక్షపురీ మందిరంబులకుం బోవుచున్న యెడ వెనుకముందర సందడుల నడిచి దూతలు ప్రీతి సలుపుచు వారలకుచేతో మోదంబుగా తమ చేతులు చాపి చూపుచు నిట్లని చెప్పందొణంగుదు రది యెట్లంటేని –

# కీర్తన

రా–మారువ తా–త్రిపుట

పరిశుద్ధం పరిశుద్ధం పరిశుద్ధమని వినబడు పురమదిగో పదపదరే ప్రియులారా। పరమేశ్వరుని చేత పరిపాలనము గల్గి చిరమై భాసురమై సుస్థిరమై సుందరమైన ॥పరిశుద్ధం॥

1. రవియైనా కుముద బాంధవుడైనా మరిదీప చ్ఛవియైనా దాని కవసరమింత లేదు। అవిరతమును క్రీస్తుడానంద ప్రభతో సం స్తవమై వైభవమై యుత్సవమై తానే వెలుగు ॥పరిశుద్ధం॥

2. క్షుధయైన మరి యే యాపదయైన దగయైన మొదలే లేకుండు నప్పురవాసులందు । మృదుజీవోదకము లర్మిలి నిరంతరమిచ్చు కుదురుగా నెదురుగా గూర్చుండి యువరాజు ॥పరిశుద్ధం॥

3. ప్రభు కృపాసనము లోపలినుంచి ప్రవహించి శుభమైన నది యుండి సుఖమిచ్చు నచట ఉభయ తీరములందు నుండే వృక్షములు సౌ రభములై శుభములై రక్షాఫలము లిచ్చు ॥పరిశుద్ధం॥

4. జననంబు మరణంబు సంసార సుఖబాధ లనుభవించుట గల్గదా పురమునందు । మును నీతికొరకాపదను బొందు తనవారి కనునీళ్లన్నియు దుడుచు మనదేవుడందుండు ॥ పరిశుద్ధం॥

5. వెలకందరాని నిశ్చలమైన ఘనజీవా విలసత్కి రీటముల్ గలవప్పురమున । పిలిచినప్పుడై విభుని పెండ్లి విందుకు జేరు కులబంధువులకు నిచ్చల నిచ్చు దేవుండు ॥ పరిశుద్ధం॥

క॥ ఇప్పగిదిని విన జెప్పుచు
నుప్పరక్షీధిపయి నేగుచౌకరౌక రళమిన్
చెప్పంగరాని వేడ్కల
నప్పరమానందపురికి నరుగుదురు వెసన్॥

## కీర్తన

రా–ముఖారి తా–ఆది

ఎంతో శృంగారమైనది యేసుని చరిత -మిది యెంతో వేడ్కై-యున్నది మోక్ష ప్రవేశం ॥ అంతట తేజోవంతుడు క్రీస్తుడు । చెంతను దూతా శ్రి తజనపజుత్తలు । వింతగ నడువగ సంతత నవ్యవ । సంతముగలియనంత జీవరసవంత । ఫలోప వనాంతరములు తత్ప్రాంతంబున గల పరమ పురమునకు । సంతసమున జనె జయ శబ్ధముతో ॥ఎంతో శృంగార॥

1. తెరచి ముయ్యంగా రానట్టి – ద్వారములారా మీ శిరములెత్తుకొని యుండండి। అనాదిగనుండే వర కవాటములారా మీరే యెత్తంగ బడుడీ । సురుచిర మహిమా స్ఫురణలు గల మీ । దొర తన పరిశుద్ధుల కరులగు భీకర దురితాత్మల దురమున జదిపి య । పరిమిత బలజయ బిరుదాంకితుడై । చిరముగ నూతన యెరూసలేమ పుర పరిపాలన తత్పరుడై యిదిగో । నెరపుగ వచ్చును నిజ భక్తులతో ॥ఎంతో శృంగార॥

2. సుందర మందా నిలమందు – జీవ సంజీవానంద సౌఖ్యప్రదమై యుండ । రేబగలంటని మందిరా వాసులప్పుడు జయ జయ శబ్ధముల । పొందుగ క్రీస్తుని బొగడుచు బాడుచు । నందరు పరమానందంబున జె । న్నొంది తమందరి కిందగు రాజుగ । వందన ఘనతలు వరుస నొనర్చుచు ॥నందముగా ప్రభు జెందిన భక్తుల । బృందములకు దగు విందు లొనర్పగ । పొందికె గలుగును

భూమికి ముక్తికి ॥ ఎంతో శృంగార ॥

3. వెలలేని బంగారంపు – కిరీటములు। చెలిమిన్ పరిశుద్ధా వంతుల। శిరముల పైబెట్టి। కళలీసు ధవళవస్త్రములు గట్టంగనిచ్చి। చెలువుగ మరి వారల చేతుల లోపల। విజయార్ధపు పర్ణము లొసగి స। కల దూతలు భక్తులతో గూడి విమల పీఠము ముం। గల నిలువంబడి। పొలుపుగ తమ దేవునకును క్రీస్తునా। కెలమిని స్తోత్రము బలఘనమనిశము। గలగును గాకని బలికి నుతింతురు ॥ఎంతో శృంగార॥

4. పరిశుద్ధ వంతులప్పుడు – శాశ్వతానంద భరితులై వీణెలు ధరియించి। పాటలు బాడుచును గురురా జైనట్టి తమ ప్రభువు గుణములు నర్ణించి। కరుణను మీ రక్తముచే మము నందరి ధరణింగల। నరవంశస్థుల తరములలోనుం చరుదుగ దేవుని। కొరకుగదా మము కొనియుంటిరి మరి। మురువుగ నిక దేవుని సుముఖంబున। దొరలుగ నర్చక। వరుల జేసితిరి। ధర యేలుదుమిక సరియని మ్రొక్కుదు ॥రెంతో శృంగార॥

అప్పుడు మరియును

చ॥ అమలుడు నిత్యు దవ్యయు డనాద్యు డనంతుడు నిర్వికారి స।
ర్వమయుడు స్వప్రకాశి యెహెూవా యను దేవుడు సర్వ భక్త సం
ఘమను వినూత్న యౌవన ప్రకాశిత కన్యకు గొట్టెపిల్లగా।
నమరిన క్రీస్తుతో పరిణయం బొనరించు సదాముదంబుగన్॥

క॥ ఇరువది నలుగురు పెద్దలు।
మరి నాలుగు జంతువులు సమస్త మహాత్ముల్।
సెరభీమాదులు దూతలు।
పరమార్ధపు పెండ్లి విందు భక్షింతురొగిన్॥

సీ॥ ఈ విందు రుచిముందు ఎరిగియుండగా గదా
గాబ్రియేలను దూత ఘనత నొందె ।
నీ విందు రుచిముందు యెరిగి యుండగగదా
మోశె యందరిలోన ముఖ్యుడయ్యె ।
నీ విందు రుచిముందు ఎరిగియుండగగదా
దావీదు భక్తులం దరినిమించె ।
నీ విందు రుచిముందు ఎరిగియుండగగదా
రోగి లాజరుమోక్ష భాగిమయ్యె

తే॥గీ॥ మరియు నీ విందు రుచిచూచి మహిని తొల్లి ।
సాధులగుక్రైస్తవులు సత్య బోధకులును
వేల సంఖ్యలుగా శాత్రవాళిచేత
ప్రాణములు వీడి రానందభరితులగును ॥

వ॥ ఇట్టి పరమానంద బంధురం బైన దేవనందనుని సుందరంబగు పెండ్లి విందు మోక్ష బృందంబులు పొందుగ ముందాగించి యనంతరంబు మంగళ సంగీతంబులు పాడి శాశ్వత సుఖంబు లనుభవింపు చుండుదు రంత.

క॥ పరలోకము భూలోకము ।
సరిగా నొకటి యగు సర్వ సామ్రాజ్య ధురం ।
ధరుడై క్రీస్తుడు శాశ్వత ।
పరిపాలన సేయు పట్ట భద్రుండగుచున్॥

# మంగళకీర్తన

రా–పంతువరాళి తా–త్రిపుట

మంగలము పాడరే – క్రీస్తుని జయ మంగళము పాడరే ॥ మంగళము పాడి దుస్సంగతిని వీడి ప్రభు । సంగులను గూడి మదిపొంగుచు జెలంగుచును ॥మంగళము పాడరే॥

1. రాజులకు రాజని – దూతల చేత పూజగొనువాడని । తేజమున సూర్యునికి దీప్తియిడు సద్గుణ వి । రాజితుని సాధుజన రక్షకుని పక్షముగ ॥ మంళము పాడరే॥

2. కరుణ గలవాడని – పాపుల బ్రోచు బిరుదుగొనినాడని మరణమను దాని బరిమార్చు ఘనశక్తి గల । పరమగురు డితడె మున పాలివాడని శుభ ॥ మంగళము పాడరే॥

3. సంగీతము పాడుచు – సువివేష ప్రసంగముల గూడుచు। నింగికిని భూమికిని నిత్యముగ నేలదగు । శృంగారపు రాజునకు క్షేమమగు నామేనని ॥ మంగళము పాడరే క్రీస్తుని జయ మంగళము పాడరే॥

క॥ ఈ రక్షణపు చరిత్రము ।
సారంబని తలచి నమ్మి జదువు బుధులకున్ ।
కారణ్యంబున దేవుడు ।
దారుణ నరకాగ్ని బాపి తనపుర మొసగున్ ॥

క॥ నజరేతు పురవిహారా ।
నిజ సుజనాశ్రిత మనో జనిత భయదూరా ।
సృజనాట వీకుతారా ।
విజయామృత సారపూర విశ్వాదారా ॥

కII భీషణ దోషాంధతమః ।
పూషా నిజసాధువర్గపోషాసుదయా ।
భూషాగుణ ఘోషామృదు ।
భాషా మనుజావతార పరమవిచారా ॥

## మాలిని

విమలమతి సమీపా వీత సంసారతాపా ।
సుమహిత నరరూపా శుద్ధవిజ్ఞాన దీపా ।
అమిత శుభవిచారా యాత్మ రక్షాధికారా ।
శమదమ గుణధీరా సత్య వేదాంతసారా ॥

## గద్యము

ఇది శ్రీ యేసునాధ పాదారవింద ధ్యానాంద రసపాన నిరంతరభ్యాస భాసమాన మాసనోల్లాస భక్తజన విధేయ పురుషోత్తమ నామధేయ ప్రణీతంబైన రక్షణ చరిత్రయందు ప్రకరణత్రయంబును సంపూర్ణము.